ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

ఆదివారం 15 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 149 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

వచ్చే వారం చైనాలో చరిత్రాత్మక

త్రైపాక్షిక భేటీ!

ఒకే వేదికపైకి ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్ 2





అయోధ్య-నేపాల్ జనక్‌పూర్ ధామ్ మధ్య వీక్లీ ట్రైన్

2

పాలిటెక్నిక్‌లపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం!

విద్యార్థుల ఆందోళనలతో జీవో 97లో సవరణలు

జీవో 157 విడుదల.. విద్యాశాఖ పరిధిలోనే పాలిటెక్నిక్‌లు

ఐటీఐలు, ఏటీఐలు మాత్రం శక్తి విభాగం పరిధిలోకి 2

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ (శక్తి విభాగం) పరిధిలోకి తీసుకురావాలన్న నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో 97ను సవరిస్తూ జీవో 157ను విడుదల చేసింది. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు ఇకపై విద్యాశాఖ పరిధిలోనే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్స్ (ఏటీఐలు) మాత్రం శక్తి విభాగం పరిధిలోనే ఉంటాయని వెల్లడించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సైతం విద్యాశాఖ పరిధిలో కొనసాగుతుందని పేర్కొంది.

-హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)



చిరంజీవిని కలిసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నషా ముక్త్ భారత్ కార్యక్రమానికి ఆహ్వానం 2

నవంబర్ 25 నుంచి 27 వరకు వాక్ నిర్వహణ

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కలిసి నడవాలని పిలుపు

సోషల్ మీడియా వేదికగా వివరాలు వెల్లడించిన కిషన్ రెడ్డి





గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత

2

రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పథకం ప్రారంభం

రూ.5 లక్షల ప్రమాద బీమా.. రూ.10 లక్షల ఆరోగ్య బీమా

హైదరాబాద్ సహా అన్ని పట్టణాల్లో విశ్రాంతి భవనాలు

పింఛన్, పాడుపు, సామాజిక భద్రతకు ప్రత్యేక చర్యలు



తెలంగాణలో గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమం కోసం రూపొందించిన పథకాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం గతంలో ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేస్తున్నామని రాహుల్‌గాంధీ తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

కార్యరూపం దాల్చిన గిగ్ వర్కర్ల చట్టం

తుది నిబంధనల జీవో విడుదల చేసిన ప్రభుత్వం 2

టార్గెట్.. సిద్ధిపేట బాబే(నా)!

కవిత భూముల చిట్టాలో హరీశ్ పేరు చుట్టూ చర్చ

గతంలో 'సిరిసిల్ల బాబు'.. 'సిద్ధిపేట బాబు' అంటూ వ్యాఖ్యలు

ఫామ్‌హౌజ్ కేంద్రంగా కుటుంబ ఆస్తుల లెక్కలు

ఆర్థిక శాఖ నిర్వహణ ఇదేనా అంటూ ప్రశ్న

కవిత అస్త్రంతో కాంగ్రెస్‌కు మరో రాజకీయ అవకాశం



> తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కుటుంబ కలహంగా మొదలైన కవిత వ్యాఖ్యలు.. ఇప్పుడు బీఆర్ఎస్‌లోని కీలక నేతల చుట్టూ రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. గతంలో కేటీఆర్‌ను 'సిరిసిల్ల బాబు' అని, హరీశ్‌రావును 'సిద్ధిపేట బాబు' అని సంబోధించిన కవిత.. తాజాగా సిద్ధిపేట వేదికగా భూముల చిట్టాను బయటపెట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకునేలా ఆమె వ్యాఖ్యలు ఉండటంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది.
>
> (ప్రత్యేక ప్రతినిధి - సింగిడి)

కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కుటుంబ సభ్యుల భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కవిత చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. కుటుంబ సభ్యుల ఆస్తుల కూడబెట్టడంపై ఆమె సంధించిన ప్రశ్నలు.. నేరుగా హరీశ్‌రావు వైపు రాజకీయ చర్చను మళ్లిస్తున్నాయి. గతంలో 'సిద్ధిపేట బాబు' అంటూ చేసిన వ్యాఖ్యలకు.. తాజా భూముల చిట్టా ప్రస్తావన తోడవడంతో ఆమె లక్ష్యం ఎవరన్న చర్చ మొదలైంది. అయితే, ఆమె ప్రస్తావించిన భూముల వివరాలకు సంబంధించిన పూర్తి అధికారిక ఆధారాలు ఇంకా స్పష్టంగా వెల్లడికావాల్సి ఉంది.

.....మిగతా 2లో

విద్వేష రాజకీయాలతో దేశాభివృద్ధి సాధ్యం కాదు!

ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న ఫాసిస్టు ధోరణులు





విద్వేష రాజకీయాలతో దేశాభివృద్ధి సాధ్యం కాదు!

2014, 2024 ఎన్నికల్లో అక్రమాలు... రాహుల్ ఆరోపణలు

మోదీ పాలనలో అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

సత్యం, అహింసతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం 2

దేశంలో గత పదేళ్లుగా ఫాసిస్టుల గొంతు గట్టిగా వినిపిస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఫాసిస్టు ధోరణుల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమిట్-2026లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ప్రచారంలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. 2014 ఎన్నికలతో భారత ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడం ప్రారంభమైందని, 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, ఘాటైన విమర్శలు చేయడం మాత్రమే కాదని వ్యాఖ్యానించారు.

అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరణ

ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ సంపద, వ్యాపార సామ్రాజ్యం భారీగా విస్తరించాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 12 ఏళ్ల క్రితం ప్రపంచ సంపన్నుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న వ్యక్తి ఇప్పుడు రెండో స్థానానికి ఎలా చేరుకున్నారని ప్రశ్నించారు. దేశంలో ఏ రంగాన్ని పరిశీలించినా అదానీ పెట్టుబడులే కనిపిస్తున్నాయని అన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, మౌలిక వసతుల రంగాలను అదానీకి అప్పగించారని విమర్శించారు. ప్రభుత్వ విధానాల వల్ల లబ్ధి పొందిన వ్యాపారవేత్తలు ఇప్పుడు వ్యవస్థలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని ఆరోపించారు.

-హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

సామాజిక న్యాయం కోసం

పోరాడదాం

ప్రజాస్వామ్యం, నియంతృత్వం మధ్య పోరాటం జరుగుతోందని వ్యాఖ్య

భారత్ సమ్మిట్ వేదికగా రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం

70 దేశాల ప్రతినిధుల వీసాల రద్దుపై కేంద్రంపై విమర్శలు 2



అంతర్జాతీయ స్థాయిలో

పీహెచ్ఎఫ్ఐ వర్సిటీ!

జూన్ 2028 నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలి

ఆరోగ్యశ్రీ పదేళ్ల డేటాను విశ్లేషిస్తే ఆరోగ్య సమస్యల మూలాలు తెలుస్తాయి

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుంది

జనవరి తర్వాత టాప్ విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు ప్రారంభం: సీఎం రేవంత్

పీహెచ్ఎఫ్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైన్సెస్ మాస్టర్‌ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. జూన్ 2028 నాటికి పీహెచ్ఎఫ్ఐ భవనం పూర్తి కావాలని అధికారులకు ఆదేశించారు. పీహెచ్ఎఫ్ఐ యూనివర్సిటీ అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతుందని ఆకాంక్షించారు. పదేళ్ల ఆరోగ్యశ్రీ డేటా విశ్లేషిస్తే రాష్ట్రంలో ఆరోగ్య సమస్యలకు మూలం తెలుసుకోవచ్చని సూచించారు.

-హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి) 2



పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి: టీడీపీ అధినేత.. సీఎం చంద్రబాబు

రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా నాయకత్వ నిర్మాణం చేపడదామని సంకల్పం

ఎట్టి పరిస్థితుల్లో గొడవలకు పోవద్దన్న ముఖ్యమంత్రి

గతం కంటే కూటమికి 25 శాతం ఓటు బ్యాంకు పెరిగిందని వెల్లడి 2



విశాఖ సీఐఐ సదస్సులో చంద్రబాబు వ్యాఖ్యలపై వివాదం 2

మీకు మసాలా కావాలి, మాకు ఫలితాలు కావాలి అంటూ చంద్రబాబు వ్యాఖ్యలు!



చిరంజీవిని కలిసిన
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

మాదకద్రవ్యాల మహమ్మారి బారిన పడకుండా యువతను కాపాడుకునేందుకు, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ, యావత్ భారతదేశాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. నవంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో 'హైదరాబాద్ వాక్స్ ఫర్ సషా ముక్త్ భారత్' పేరుతో ఈ భారీ వాక్‌థాన్ జరగనుంది. మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో హైదరాబాద్ ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యపరచడానికి చిరంజీవి తమతో కలిసి రానున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో చిరంజీవికి ఉన్న విశేష ఆదరణ ద్వారా యువతలో విస్తృత అవగాహన తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ ఈ ఉద్యమంలో ఐక్యంగా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

విద్వేష రాజకీయాలతో
దేశాభివృద్ధి సాధ్యం కాదు!

కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలు ప్రజల సమస్యలను వినడం లేదని రాహుల్‌గాంధీ విమర్శించారు. తాము చేపట్టిన భారత్ జోడో పాదయాత్రలో ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకున్నామని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కొంతమందిని కొంతకాలం మోసం చేయవచ్చని, అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరన్న కెన్నెడీ వ్యాఖ్యలను ప్రస్తావించారు. అబద్ధాలతో ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నించారు.

సత్యం, అహింసే బలమైన ఆయుధాలు

సత్యం, అహింస అనేవి అత్యంత శక్తిమంతమైన ఆయుధాలని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. హింస, విద్వేషం, ఘర్షణల వాతావరణంలో అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. విద్వేషం, హింస మార్గంలో ప్రత్యర్థులను ఓడించలేమని, తమ రాజకీయ సిద్ధాంతం, మనస్తత్వం అలాంటిది కాదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, శాంతి, సామరస్యాల ద్వారానే దేశం ముందుకు సాగుతుందని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ స్థాయిలో
పీహెచ్ఎఫ్ఐ వర్సిటీ!

ఇప్పుడు రాష్ట్రంలో క్యాన్సర్‌ను నోటిపై చేస్తున్నామని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ విధానాలు దేశాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాయని రేవంత్‌రెడ్డి అన్నారు. నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యమిచ్చారని, రాజీవ్‌గాంధీ కంప్యూటర్, ఇంటర్నెట్ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోనూ విద్యావకాశాలున్నాయని తెలిపారు. కానీ నాణ్యత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాలకు ఎగుమతి చేసేలా ఆహారం ఉంది కానీ పౌష్టికాహారం లేదన్నారు.

జూన్ 2028 నాటికి పీహెచ్ఎఫ్ఐ భవనం పూర్తి

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఏ రాష్ట్రం పోటీపడనంతగా వేగంగా తెలంగాణ దూసుకెళ్తోందని అన్నారు. పక్క రాష్ట్రాల్లో ఉన్నట్లు విధానపరమైన గందరగోళం తెలంగాణలో లేదని విమర్శించారు. జనవరి తర్వాత హైదరాబాద్‌లో టాప్ విదేశీ యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లను ప్రారంభిస్తాయమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేంద్రం టెండర్లు పిలిచిందని పేర్కొన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ధైర్యంగా ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవచ్చని సీఎం భరోసానిచ్చారు.

పంచాయతీ ఎన్నికలను
తేలిగ్గా తీసుకోవద్దు

అమరావతి, నవంబర్ 14 (సింగిడి)

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు.
ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.

వచ్చే వారం చైనాలో చరిత్రాత్మక
త్రైపాక్షిక భేటీ!

న్యూఢిల్లీ, నవంబర్ 14 (సింగిడి)

అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక అరుదైన, చరిత్రాత్మక ఘట్టానికి రంగం సిద్ధమైంది. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే వారం చైనాలోని షెన్‌జెన్ నగరంలో ముఖాముఖి సమావేశం కానున్నారు. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ సదస్సు సందర్భంగా ఈ ముగ్గురు అగ్రనేతలు చరిత్రాత్మక త్రైపాక్షిక భేటీ నిర్వహించనున్నట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచంలోని మూడు అగ్రరాజ్యాల అధినేతలు ఇలా ఒకే వేదికపై త్రైపాక్షిక చర్చలు జరపడం అంతర్జాతీయ దౌత్య చరిత్రలోనే అత్యంత కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. నవంబర్ 18-19 తేదీల్లో చైనా వేదికగా 33వ అపెక్ ఆర్థిక నేతల సదస్సు జరగనుంది. ఇందులో 21 సభ్య దేశాల అధినేతలు పాల్గొననుండగా, ఈ సదస్సు సందర్భంగానే ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ మధ్య ప్రత్యేక భేటీ జరగనుంది. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు/సంఘర్షణలు, కృత్రిమ మేధస్సు, అణ్వాయుధాల తగ్గింపు వంటి పలు కీలక అంతర్జాతీయ అంశాలపై నేతలు చర్చించనున్నారు.

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత



గతంలో గిగ్ వర్కర్లతో సమావేశంలో వారి సమస్యలను ప్రస్తావించారని, వారి సంక్షేమం కోసం నాడు ఇచ్చిన హామీని నేడు నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు గిగ్ వర్కర్లకు సంబంధించిన సరైన సమాచారం అందుబాటులో ఉండేది కాదన్నారు. వారు ఎన్నిగంటలు పనిచేస్తున్నారు, ఎంత ప్రతిఫలం పొందుతున్నారనే వివరాలపై సమగ్ర సమాచారం లభించేదని కాదని, కానీ ఈ గిగ్‌వర్కర్ల చట్టం ద్వారా అన్ని వివరాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. డెలివరీ, శ్రమ, ప్రతిఫలానికి సంబంధించి అన్ని వివరాలు ఫోన్‌లోనే వస్తాయని వివరించారు.
గిగ్‌వర్కర్లకు వైఫైతో కూడిన విశ్రాంత భవనం అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో విశ్రాంత భవనాలు నిర్మిస్తామన్నారు. గిగ్‌వర్కర్లకు ప్రభుత్వం రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందిస్తుందని తెలిపారు. వీరి పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
కాంగ్రెస్ పూర్తి అండగా నిలుస్తుంది

గిగ్‌వర్కర్ల బోర్డు ద్వారా ప్రతి డెలివరీలో ఒక శాతం డబ్బు గిగ్‌వర్కర్ల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వెల్లడించారు. వారికి రక్షణ కల్పించాలనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచన అని రాహుల్ స్పష్టం చేశారు. గిగ్‌వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.
రాహుల్ చేతులమీదుగానే చట్టం అమలు గిగ్‌వర్కర్ల కష్టానికి చట్టబద్ధమైన ఆదాయం లభించడం తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గిగ్‌వర్కర్లకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు కోసం ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ చేతులమీదుగా గిగ్‌వర్కర్ల చట్టాన్ని అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. నెహ్రూ జయంతి సందర్భంగా గిగ్‌వర్కర్లకు పథకాన్ని అంకితం చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గిగ్‌వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేస్తామని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఈ చట్టం వారికి రక్షణ కల్పిస్తుందని వివరించారు.

గిగ్ వర్కర్ల ర్యాలీ

అంతకు ముందు నిర్వహించిన గిగ్‌వర్కర్ల ర్యాలీలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు. శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో గిగ్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్యరూపం దాల్చిన
గిగ్ వర్కర్ల చట్టం

హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ఆధారంగా పనిచేస్తున్న గిగ్ వర్కర్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం కార్యరూపం దాల్చింది. ఈ మేరకు కార్మిక శాఖ తుది నిబంధనలను విడుదల చేసింది. స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, ఇతర ప్లాట్‌ఫామ్ ఆధారిత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనున్నారు. గిగ్ వర్కర్ల హక్కులు, సంస్థల బాధ్యతలను స్పష్టం చేస్తూ కార్మిక శాఖ ఉత్తర్వుల్లో (జీవో) వెల్లడించింది. దీంతో గిగ్ వర్కర్లకు గుర్తింపు సంఖ్యతో పాటు బీమా, వైద్య, ఇతర సామాజిక ప్రయోజనాలు కల్పించేందుకు మార్గం సుగమమైంది. తెలంగాణలో గిగ్ ఎకానమీ రంగంలో పనిచేస్తున్న 6 లక్షల మందికి పైగా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ చట్టం– 2026 అమలులో భాగంగా జీవో ఎంస్ నం.18 ద్వారా నవంబర్ 14న తుది నిబంధనలు జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం ప్రతి గిగ్ వర్కర్‌ను ప్రభుత్వ డేటాబేస్‌లో నమోదు చేయాలి. నమోదు పూర్తయిన తర్వాత ప్రత్యేకమైన గిగ్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయిస్తారు. ఒక కార్మికుడు స్విగ్గీ, జొమాటో వంటి ఒకటి కంటే ఎక్కువ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసినా ఒకే జీఐడీ వర్తిస్తుంది. ఆన్‌లైన్ పోర్టల్, సంస్థల యాప్‌లు, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా కూడా కార్మికులు స్వయంగా నమోదు చేసుకోవచ్చు.

టార్గెట్.. సిద్ధిపేట బాబే(నా)!

ఆర్థిక శాఖ చూసిన నేతకు తెలియదా?

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆర్థిక శాఖతో పాటు కీలక బాధ్యతలు నిర్వహించిన నేత హరీశ్‌రావు. అలాంటి నాయకుడి పరిధిలోకి వచ్చే రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై ఇప్పుడు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కుటుంబ ఆస్తుల వ్యవహారం కవిత ఆరోపిస్తున్నట్లుగా జరిగి ఉంటే.. ఆ వివరాలు హరీశ్‌రావుకు తెలియవా చర్చ ను ఆమె లేవనెత్తింది. ఆమె బయటపెట్టిన వివరాలు కేవలం కుటుంబ సభ్యుల ఆస్తులకే పరిమితమా? లేక మరికొందరి పాత్రను కూడా ప్రశ్నిస్తున్నాయా? అనేది తేలాల్సి ఉంది.

మౌనమే వ్యూహమా..

కవిత వరుస వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు వైఖరిపై ఆసక్తి నెలకొంది. ఈ ఆరోపణలపై ఆయన నుంచి స్పష్టమైన వివరణ వస్తుందా? లేక కుటుంబ వివాదంలోకి వెళ్లకుండా రాజకీయంగా సంయమనం పాటిస్తారా? అన్నది చర్చనీయాంశమైంది. ఆరోపణలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఆయనపై ఉందని రాజకీయ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రబుల్ షూటర్ గా బిఆర్ఎస్ ను ఎన్నో ఆపదల నుంచి కాపాడినాడనే పేరున్న హరీష్ రావు మౌనం వెనుక పెద్ద వ్యూహమే ఉందన్న అభిప్రాయాలు కార్యకర్తల్లో ఉన్నాయి.

ఫామ్‌హౌజ్ అస్త్రానికి కొత్త పదును

కేసీఆర్ ఫామ్‌హౌజ్ వ్యవహారాన్ని ఇప్పటికే కాంగ్రెస్ రాజకీయంగా ప్రస్తావిస్తోంది. గతంలో కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌజ్‌ల అంశాన్ని కూడా కాంగ్రెస్ నేతలు తెరపైకి తెచ్చారు. హరీశ్‌రావు ఫామ్‌హౌజ్ వద్దకు బస్సుయాత్ర నిర్వహించడం కూడా అప్పట్లో రాజకీయ చర్చకు దారితీసింది. ఇప్పుడు కవిత భూముల చిట్టా ప్రస్తావనతో అదే అంశానికి మరో కోణం జతైంది. బీఆర్ఎస్ అంతర్గత విభేదాల నుంచి వచ్చిన వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌కు రాజకీయంగా మరో అస్త్రంగా మారే అవకాశముంది.

కవిత నెక్స్ట్ టార్గెట్..?

తన ఆస్తుల విషయంలో స్పష్టత ఉందని, తాను అవినీతికి దూరమని కవిత చెబుతున్న సందర్భంలో.. ఇతరుల ఆస్తుల వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఒకప్పుడు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న హరీశ్‌రావు.. ఇప్పుడు కవిత వ్యాఖ్యల నేపథ్యంలో రాజకీయంగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కవిత ఆరోపణలకు హరీశ్‌రావు స్పందిస్తారా? భూముల వివరాలపై మరింత సమాచారం బయటపెడతారా? లేక ఈ వివాదం ఇంతటితో ఆగుతుందా? అనేది చూడాలి. మొత్తంగా కవిత బయటపెట్టిన చిట్టా కుటుంబ ఆస్తుల చర్చను దాటి బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. కవిత గురి నిజంగానే సిద్దిపేట బాబువైపేనా? భవిష్యత్తు పరిణామాలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పనున్నాయి.

విశాఖ సీఐఐ సదస్సులో చంద్రబాబు వ్యాఖ్యలపై వివాదం

అమరావతి, నవంబర్ 14 (సింగిడి)

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన విషయంలో ఏ రాష్ట్రం ముందుందో 2027 దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికపై తేల్చుకుందామంటూ ఏపీ ప్రభుత్వానికి టీపీకే నేరుగా బహిరంగ సవాల్ విసిరింది. విశాఖ సదస్సులో పరిశ్రమల తరలింపు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పందిస్తూ.. మీకు 'మసాలా' కావాలి, మాకు మాత్రం ఫలితాలు కావాలి అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ సహజమని, పెట్టుబడిదారులకు అనుకూలమైన పరిస్థితులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళతారని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక పునాది బలపడే వరకే ఆరంభంలో ఇచ్చే రాయితీలు అవసరమని, ఆ తర్వాత వాటిని తగ్గిస్తామని చెప్పారు. తమ ప్రభుత్వ పారిశ్రామిక విధానాల వల్ల ఏపీకి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలపై టీపీకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన స్థాయికి ఇలాంటి వ్యాఖ్యలు తగవని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది సత్యకుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను ఉద్దేశించి ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పారిశ్రామిక రంగం కేవలం ఆర్మాటం కాదని, నాణ్యమైన విద్య, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, తరతరాల శ్రమతో నిర్మితమైందని ఆయన గుర్తుచేశారు. అటువంటి వ్యవస్థను తేలిగ్గా "మసాలా" అంటూ కొట్టిపారేయడం సరికాదన్నారు. 2027 జనవరిలో జరిగే దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు నాటికి ఏ రాష్ట్రం ఎన్ని పెట్టుబడులు సాధించింది, ఎంతమందికి ఉపాధి కల్పించిందో స్పష్టమైన లెక్కలతో చూసుకుందామని సత్యకుమార్ సవాల్ చేశారు. విజయ్ నాయకత్వంలో తమిళనాడును దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా సరికొత్త పారిశ్రామిక విధానాలతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. తమిళనాడు ఆత్మగౌరవం, సమాఖ్య స్ఫూర్తి, పెరియార్, అన్నాదురైల సామాజిక న్యాయ సిద్ధాంతాలపై ఆధారపడి నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. తిరుక్కురళ్‌ను ఉటంకిస్తూ, తాము సిద్ధాంతాలపై రాజీపడే ప్రసక్తే లేదని, బీజేపీతో ఎలాంటి పొత్తులు లేకుండానే అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నినీ ప్రస్తానం మద్రాసుతో ముడిపడి ఉండటం, ఎంజీఆర్‌తో ఆయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన ఫలితాల ఆధారంగానే ఎవరు ముందో తేల్చుకుందామని టీపీకే స్పష్టం చేసింది.

అయోధ్య-నేపాల్ జనక్‌పూర్ ధామ్ మధ్య వీక్లీ ట్రైన్

న్యూఢిల్లీ, నవంబర్ 14 (సింగిడి)

భారత్– నేపాల్ మధ్య సాంస్కృతిక సంబంధాలు, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య కంటోన్మెంట్ వరకు కొత్త వారాంతపు రైలు (వీక్లీ ట్రైన్) సర్వీసును నడిపేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. రామాయణ ఇతిహాసంతో ముడిపడి ఉన్న ఈ రెండు అత్యంత పవిత్ర క్షేత్రాలను ఈ రైలు అనుసంధానం చేయనుంది. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యను, సీతాదేవి జన్మస్థలంగా పూజలందుకునే నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్‌ను ఈ రైలు మార్గం నేరుగా కలుపుతుంది. రైల్వే శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ట్రైన్ వారానికి ఒకసారి నడుస్తుంది. ప్రతి శనివారం నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి బయలుదేరుతుంది. మొత్తం 604 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ముఖ్య పట్టణాలు, నగరాల మీదుగా ఈ రైలు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి సోమవారం అయోధ్య కంటోన్మెంట్ నుంచి బయలుదేరుతుంది.జనక్‌పూర్ ధామ్, అయోధ్య కంటోన్మెంట్ టెర్మినల్ స్టేషన్లతో పాటుగా మార్గమధ్యలో జయనగర్, మధుబనీ, శివోహ్, సీతామర్హి, రక్సాల్, నర్కటియాగంజ్, గోరఖ్‌పూర్, బస్తీ, మన్కాపూర్, అయోధ్య ధామ్ స్టేషన్లలో ఈ ట్రైన్ ఆగుతుంది. రైల్వే శాఖ ప్రకటనలో ప్రయాణ దూరాన్ని సుమారు 604 కిలోమీటర్లుగా పేర్కొనగా, ప్రతిపాదిత మార్గం దాదాపు 464 కిలోమీటర్లుగా ఉంది. ఈ నూతన రైలు సర్వీస్ ప్రారంభం కావడం వల్ల ఇరు దేశాల మధ్య రాకపోకలు సాగించే పర్యాటకులు, భక్తులు, ఇంకా సాధారణ ప్రయాణికులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని రైల్వే మంత్రిత్వ శాఖ పేర్కొంది. ముఖ్యంగా అయోధ్య– జనక్‌పూర్ ధామ్ మధ్య ఆధ్యాత్మిక యాత్రలు చేసే వారికి ఇదెంతో ప్రయోజనకరంగా ఉండనుంది.ఆధ్యాత్మిక పర్యాటకానికి, ఆర్థిక వ్యవస్థకు ఊతంతో కొత్త రైలు సర్వీస్ భక్తులు, పర్యాటకులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది. 'రామాయణ సర్క్యూట్' పర్యాటకాన్ని ప్రోత్సహించడమే కాకుండా, విద్య, వ్యాపారం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణించే వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇంకా ఈ కొత్త ట్రైన్ సర్వీస్ అందుబాటులోకి రావడం వల్ల ఆయా మార్గాల్లోని టూరిజం ఆపరేటర్లు, హోటళ్లు, స్థానిక వ్యాపారులు, సంప్రదాయ హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని రైల్వే శాఖ తెలిపింది.
బిహార్– నేపాల్ సరిహద్దు ప్రాంతాల ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక సంబంధాలు కూడా మరింత బలపడతాయని పేర్కొంది.



పాలిటెక్నిక్‌లపై వెనక్కి
తగ్గిన ప్రభుత్వం
జీవో 157 విడుదల

హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

కార్మికశాఖ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలల విలీనంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు వివాదస్పద జీవో 90ను సవరిస్తూ జీవో 157ను జారీ చేసింది. పాలిటెక్నిక్‌లతోపాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఉంటాయని ఉత్తర్వులు ఇచ్చింది.

ఇవి మాత్రం కార్మిక శాఖలోనే

ఐటీఐలు, ఏటీసీలు మాత్రం కార్మిక శాఖ పరిధిలోనే కొనసాగుతాయని, కానీ కరికులమ్ మాత్రం స్కిల్ యూనివర్సిటీ నియంత్రణలో ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అకడమిక్ కార్యక్రమాలను విస్తరించడం కోసం ఏఐసీటీఈ, ఇతర సంస్థల నుంచి అనుమతులు పొందేందుకు చర్యలు చేపట్టాలని స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఆదేశించింది.

అసలేం జరిగిందంటే

విద్యాశాఖ పరిధిలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్‌లను కార్మిక శాఖలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 16న జీవో 97 విడుదల చేసింది. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళనకు దిగారు. స్కిల్ యూనివర్సిటీకి ఏఐసీటీఈ అనుమతి లేనందున పాలిటెక్నిక్ పూర్తి చేసిన తర్వాత బీటెక్ రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీతోపాటు వివిధ సంఘాలు కూడా వీరికి మద్దతునిచ్చాయి. దీంతో ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు చైర్మన్‌గా ఎమ్మెల్సీ కోదండ రామ్, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రత్యేక సీఎస్ నవీన్ మిత్తల్, శక్తి డిపార్ట్‌మెంట్ కార్యదర్శి, సాంకేతిక విద్యా కమిషనర్ సభ్యులుగా ప్రభుత్వం అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది.

జీవో 90ను సవరించిన ప్రభుత్వం

పాలిటెక్నిక్ విద్యను ఆధునికీకరించడంతోపాటు విద్యార్థులు, ఉద్యోగుల అకడమిక్, కెరీర్‌ను పరిరక్షించడానికి అవసరమైన సూచనలు ఇవ్వాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించిన కమిటీ పాలిటెక్నిక్‌ల విలీనాన్ని నిలిపివేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం జీవో 157ను జారీచేసింది.

హర్షం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

పాలిటెక్నిక్ విద్యార్థుల ఐక్యత, అవిశ్రాంత పోరాటానికి విజయం లభించిందని మాజీమంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. 35 రోజుల పోరాటం తర్వాత విద్యార్థులు గెలిచారని పేర్కొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడదాం..

హైదరాబాద్, నవంబర్ 14 (సింగిడి)

హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్'లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. ఒకే ఆలోచనా ధోరణి కలిగిన ప్రపంచ నాయకులు, ప్రభావశీలురను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఈ సమ్మిట్ ఒక గొప్ప వేదికని ఆయన అభివర్ణించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ఈ కార్యక్రమం జరగడం ఎంతో ప్రత్యేకమని పేర్కొంటూ, దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావడానికి నెహ్రూ దార్శనికత ఎంతో దో

జాతీయ స్థాయి వాలీబాల్‌లో గాంధారి యువకుడి సత్తా





నాలుగు గోల్డ్ మెడల్స్ తో నాగ్లూర్ గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు ...చరణ్ విజయంపై మండల ప్రజలు, ప్రజాప్రతినిధుల హర్షం

కామారెడ్డి /గాంధారి, నవంబర్ 12:(సింగిడి)
గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభకు కొదవ లేదని, సరైన ప్రోత్సాహం, కృషి, పట్టుదల ఉంటే జాతీయ స్థాయిలోనూ రాణించవచ్చని కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నాగ్లూర్ గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు చరణ్ నిరూపిస్తున్నాడు. చిన్ననాటి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకున్న చరణ్ నేడు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటూ నాలుగు బంగారు పతకాలు సాధించడం గ్రామానికే కాకుండా గాంధారి మండలానికి గర్వకారణంగా నిలిచింది.చిన్నప్పటి నుంచే క్రీడలపై మక్కువ చూపుతూ, ప్రతి పోటీలో తన ప్రతిభను చాటుకుంటూ వచ్చిన చరణ్ ఎదుగుదల వెనుక తల్లి దండ్రుల ప్రోత్సాహం, వారి కృషి, చరణ్‌కు ఉన్న అంకితభావం, పట్టుదల ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ క్రీడారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో చదువుకుంటున్న చరణ్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ రూపేందర్ సింగ్, క్లాస్ టీచర్ ఆస్తా తివారి అందించిన సహకారం, ప్రోత్సాహం అతని క్రీడా ప్రయాణానికి మరింత బలాన్నిచ్చాయి. 2025లో జరిగిన అండర్-19 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న చరణ్, 2026లో నిర్వహించిన టోర్నమెంట్లలో తన ప్రతిభను చాటుతూ నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం.గ్రామీణ ప్రతిభకు జాతీయ గుర్తింపు..సాధారణ గ్రామీణ కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించడం చిన్న విషయం కాదు. చరణ్ సాధించిన విజయాలు గ్రామీణ ప్రాంతాల్లోని ఇతర యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని మండల నాయకులు, గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువతకు తగిన అవకాశాలు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చరణ్ నిరూపించాడని ప్రశంసిస్తున్నారు.ప్రజాప్రతినిధుల అభినందనలు..జాతీయ స్థాయిలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించి గాంధారి మండలానికి గుర్తింపు తీసుకొచ్చిన చరణ్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తానాజీ రావు, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్‌తో పాటు పలువురు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.చరణ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నాగ్లూర్ గ్రామం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన చరణ్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఒక గ్రామం నుంచి జాతీయ స్థాయికి.. నాలుగు స్వర్ణ పతకాలతో సత్తా చాటిన చరణ్ ప్రయాణం నేటి యువతకు నిజమైన స్ఫూర్తి!

రాజన్న ఆలయ విస్తరణ..అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

ప్రణాళిక ప్రకారం ఒక్కో పనికి గడువు విధించి..ముందుకు వెళ్లాలి
పనులకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను మరింత పెంచాలి
ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై సమీక్ష, క్షేత్రస్థాయిలో పరిశీలించిన
దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ వీటీఏడీఏ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనుల పై భీమేశ్వర స్వామి ఆలయ గెస్ట్ హౌస్ లో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారుతో కలిసి. సమీక్ష సమావేశం నిర్వహించి. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు.అనంతరం రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బీ సీఈ, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారు, స్థపతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి. అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి. పూర్తి చేస్తూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. పనులకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమా నాయక్, స్థపతులు జయేంద్రన్, గణేష్, స్ట్రక్చర్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ జయంత్ తదితరులు ఉన్నారు.

టీజీ20 కి ఎంపికైన గణపతి భాను ఎంపిక

సిద్దిపేట ప్రతినిధి , నవంబర్ 14, (సింగిడి):
జిల్లా క్రీడారంగంలో మరో ప్రతిభ వెలుగులోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ టీజీ20 క్రికెట్ లీగ్‌కు సిద్దిపేట జిల్లాకు చెందిన గణపతి భాను ఎంపికైన సందర్భంగా రజక జాతీయ అధ్యక్షుడు నడిమిట్టి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, లు సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి రాష్ట్రస్థాయి క్రికెట్‌లో అవకాశాలు కల్పించే విధంగా ఈ లీగ్‌ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గజ్వేల్ టైటాన్స్ జట్టు తరఫున గణపతి భాను ఎంపిక కావడంతో పలువురు ప్రశంసించారు. స్థానిక స్థాయిలో తన ఆటతీరుతో గుర్తింపు పొందిన భాను.. ఇప్పుడు రాష్ట్రస్థాయి వేదికపై సత్తా చాటలని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఇలాంటి అవకాశాలు లభించడం క్రికెట్‌పై ఆసక్తి ఉన్న యువతకు ఇది మంచి అవకాశం సిద్దిపేట జిల్లా నుంచి టీజీ 20 లీగ్‌కు ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు, యువ క్రికెటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే పోటీల్లో గణపతి భాను రాణించి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. సిద్దిపేట మట్టిలో పుట్టిన క్రికెట్ ప్రతిభ.. రాష్ట్రస్థాయి వేదికపై మెరవాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, రాష్ట్ర కన్వీనర్ షాగంటి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు, మండల ల అధ్యక్షులు రజక నాయకులు పాల్గొన్నారు.

వ్యతిరేక శక్తులతో భారత్ సమ్మిట్ నిర్వహించడం దారుణం

-బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి
కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల జెండాలతో బీజేపీ నిరసన- కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం .. రాష్ట్ర అభివృద్ధి కోసం పెట్టుబడులు తీసుకురావాలి తప్ప దేశ గౌరవాన్ని దిగజార్చకూడదు
రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్14 (సింగిడి)



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ పేరుతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు భారతదేశాన్ని వ్యతిరేకించే శక్తులను ఆహ్వానించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి విమర్శించారు.జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నల్ల జెండాలతో ఆందోళన నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధ్యక్షత వహించారు. గోపి పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, అభివృద్ధి సాధించడం లక్ష్యంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెబుతున్నారని, గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయి? ఎంతమందికి ఉపాధి లభించిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు.భారత్ సమ్మిట్ పేరుతో విదేశాల నుంచి భారతదేశాన్ని వ్యతిరేకించే, దేశ సమగ్రతను ప్రశ్నించే శక్తులకు ఆహ్వానాలు పలకడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దీనికి మద్దతు తెలపడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసే వ్యక్తులకు అంతర్జాతీయ వేదిక కల్పించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.రాష్ట్ర అభివృద్ధికి, పెట్టుబడుల రాకకు, పరిశ్రమల ఏర్పాటుకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పెట్టుబడులు పెట్టే కంపెనీలను, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి సమ్మిట్‌లు నిర్వహిస్తే స్వాగతిస్తామని, కానీ అభివృద్ధి పేరుతో భారతదేశ గౌరవాన్ని కించపరిచే శక్తులకు ప్రాధాన్యత కల్పించడాన్ని మాత్రం సహించేది లేదని హెచ్చరించారు.ప్రపంచ దేశాల్లో భారతదేశం తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న తరుణంలో దేశ ఔన్నత్యానికి భంగం కలిగించే విధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడం సరికాదన్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలి, పెట్టుబడులు రావాలి, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలి. అదే సమయంలో భారతదేశ గౌరవం, ప్రతిష్ఠకు భంగం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉడుగుల యాదగిరి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి జలపతి రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్ నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాబీర్, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ ,సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి, బీజేపీ రాష్ట్ర,జిల్లా, వివిధ మోర్చాల, మండల పదాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ ల మధ్య రాజకీయ పంచాయతీ పెడుతున్న ప్రభుత్వాలు

బీసీ (ఏ) లో ముదిరాజ్ లను కలుపొద్దు
ఈ డబ్ల్యూ ఎస్ వల్ల బీసీ లకు పూర్తిగా అన్యాయం
సిద్దిపేట లో డిసెంబర్ 13న రాష్ట్ర మహాసభ



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 14, (సింగిడి):
బీసీ కులాల మధ్య తగవు సోద్యం చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని జాతీయ నాయకులు నడిమింటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సన్నాహక సమావేశం నిర్వహించి సిద్దిపేట లో రాష్ట్ర 4వ మహాసభ డిసెంబర్ 13న నిర్వహించ బోతున్నామని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక తెలిపారు. రాష్ట్రం మరియు జిల్లా నలుమూలల నుంచి రజకులు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు..ఈ సందర్భంగా నడిమింటి శ్రీనివాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజ్ లను బీసీ "ఏ" చేర్చుతామని చెప్పడం సరి కాదన్నారు. బీసీ (ఏ) లో 56 కులాలకు న్యాయం చేసిన తరువాత మీరు ఏమైనా చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఈ డబ్యూ ఎస్ వల్ల బీసీ లకు పూర్తిగా అన్యాయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ డబ్యూ ఎస్తో నష్టం
ఎలాంటి పరీక్షలలో 150 మార్కులు వచ్చిన ఉద్యోగాలు రావడం లేదని, ఈ డబ్యూ ఎస్ వల్ల 50 మార్కులు సాధించిన వారికి ఉద్యోగాలు రావడంతో బీసీ లు పూర్తిగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు న్యాయం చేసిన తరువాత బిసి కులాలను ఎందులోనైనా విలీనం చేయాండని చెప్పారు. మీరు మొండిగా వ్యవహరించి ముది రాజ్ లను బీసీ (ఏ)లో విలీనం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని తెరాలేపుతా మని హేచ్చరించారు. ప్రభుత్వం ఏవైనా, పార్టీలు ఏవైనా మాకు అన్యాయం చేయాలని చూస్తే తెలంగాణ ఉద్యమం తరహాలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, రాష్ట్ర కన్వీనర్ షాగంటి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు, మాజీ ఎంపీపి దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ శివ గారి అంజయ్య, సర్పంచులు నేరెళ్ల రాజయ్య కరుణాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు, మండల నాయకులు పాల్గొన్నారు.

బాలల సమస్యలపై గ్రామసభ

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 14, (సింగిడి):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్సాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బాలల గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాలబాలికల సమస్యలు, అవసరాలపై చర్చించారు. విద్య, పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆటస్థలాల ఏర్పాటు తదితర అంశాలపై పిల్లల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. బాలలు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు.

గాంధారిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



చిన్నారులతో కలిసి సంబరాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు
కామారెడ్డి గాంధారి

నవంబర్ 14 (సింగిడి)గాంధారి:
బాలలే దేశ భవిష్యత్తు, వారి ఆనందమే సమాజానికి నిజమైన సంతోషమనే సందేశంతో గాంధారి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్ చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు లైని రమేశ్, బెల్లయి అశోక్ యాదవ్, గంగి రవి యాదవ్, మోచి శ్రీనివాస్, జరప్ల సంజీవ్, జింగురు సురేష్, చద్దుల్ సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు, మహిళలు, అధికారులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారుల ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ఆహ్లాదకరంగా ముగిశాయి.

నిరుద్యోగులకు సువర్ణావకాశం

5 రకాల ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 14 (సింగిడి): పెద్దపల్లి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాబోయే మూడు నెలల్లో ఐదు రకాల ఉచిత వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుట్టు మిషన్, జనపనార సంచుల (జూట్ బ్యాగుల) తయారీ, పుట్టగొడుగుల పెంపకం,బ్యూటీ పార్లర్ నిర్వహణ, మగ్గం వర్క్ విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంత యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణకు 18 నుండి 49 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, కనీసం పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటో,మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు , బ్యాంకు ఖాతా పుస్తకం నకలు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు మరియు దరఖాస్తుల కోసం పెద్దపల్లిలోని రంగంపల్లి కోర్టు సమీపంలో, మైత్రి కిచెన్ పక్కన గల సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ లేదా 9392221907 ఫోన్ నంబర్ ద్వారా గానీ సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఆలయ వార్షికోత్సవాలకు కేటీఆర్ కు ఆహ్వానం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)
జిల్లాలో ఎల్లారెడ్డిపేట లోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు ఆధ్వర్యంలో కెటిఆర్ ను కలిసి కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తో పాటు మీసంరాజం,వెంకటరెడ్డి, అజ్జు, సందీప్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు ఆహ్వాన పత్రిక అందించి, శాలువాతో సత్కరించి ఆహ్వానించారు.ఈ నెల 19 నుంచి 24 వరకు జరిగే భకోత్సవాలు వైభవంగా జరపాలని కేటీఆర్ సూచించారు.

నెహ్రూ జయంతి



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 14, (సింగిడి):
భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సిద్దిపేట లో గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం నివాళులర్పించారు.నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ...దేశ స్వాతంత్ర్య పోరాటంలో జవహర్‌లాల్ నెహ్రూ అందించిన సేవలను, స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన నెహ్రూ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని నెహ్రూకు ఘన నివాళులర్పించారు.

రేవంత్ డైరెక్షన్‌లో కవిత యాక్షన్!

హరీష్ రావుకు కవిత క్షమాపణ చెప్పాలి



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 14, (సింగిడి):
కవిత కాంగ్రెస్‌కు బీ టీమ్‌గా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఘాటుగా విమర్శించారు. హరీష్‌రావుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కవిత కష్టకాలంలో హరీష్‌రావు అందించిన సహకారాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగిన మేలును విస్మరించరాదన్నారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం రాజకీయ విలువలను దిగజార్చవద్దని, కవిత తక్షణమే హరీష్‌రావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాముని శ్రీనివాస్, ములకల కనక రాజు, జంగిడి శ్రీనివాస్ కాముని ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి కేటీఆర్ అండ

షాపు పునర్నిర్మాణానికి సహకరిస్తా: కల్వకుంట్ల వంశీధర్ రావు

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 14, (సింగిడి):
దీపావళి రోజున 1వ వార్డు లింగారెడ్డిపల్లి లో ప్రమాద వశత్తు అగ్నిప్రమాదం సంభవించి కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధమైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కెవిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్వకుంట్ల వంశీధర్ రావు వారిని పరామర్శించారు.సిద్దిపేట 1వ వార్డు లో హనుమాన్ ఆలయం వద్ద కిరాణం నడుపుకుంటున్న జీవనోపాధి కోల్పోయి సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని లింగారెడ్డిపల్లికి చెందిన బొల్లు శివాని వంశీధర్ రావు కు వేడుకోవడంతో స్పందించి షాపు పునర్నిర్మాణానికి పూర్తి సహకారం అందించి అండగా ఉంటానని వంశీధర్ రావు బాధితురాలికి హామీ ఇచ్చారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు.. 19న ఖాతాల్లో జమ

ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 14 (సింగిడి):
సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుల్ల రోడ్డులో గల ఎస్.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన 'చేయూత' పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధితో పాటు మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు చెందిన మొత్తం 1,041 మంది లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పింఛన్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇందులో మండల పరిధిలో 755 మంది వికలాంగులు 410, ఒంటరి మహిళలు 155, వితంతువులు 130, గీత కార్మికులు 48, చేనేత కార్మికులు 12 మున్సిపల్ పరిధిలో 286 మంది వితంతువులు 158, వికలాంగులు 57, గీత కార్మికులు 20, ఒంటరి మహిళలు 17, చేనేత కార్మికులు 4 ఉన్నారని ఆయన వివరించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాంకేతిక కారణాలతో దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రీ-సర్వే నిర్వహించి అర్హులందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19వ తేదీ సాయంత్రం లోపు నగదు జమ అవుతుందని వెల్లడించారు. అలాగే, వృద్ధాప్య పింఛన్

ఎడిటోరియల్

Editorial

“ప్రపంచ మధుమేహ రాజధాని”గా భారతం!

ప్రపంచ దేశాల్లో మధుమేహం లేదా డయాబెటిస్ అత్యధికంగా విస్తరించి ఉన్న దేశంగా భారత్ మరో చరిత్రను సృష్టించడంతో పాటు “ప్రపంచ మధుమేహ రాజధాని భారత్” అనే ప్రతికూల ఖ్యాతిని మూటగట్టుకుంటున్నది. “ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్” వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 40 ఏండ్లు దాటిన ప్రతి 8 మంది వయోజనుల్లో ఒక్కరు మధుమేహంతో బాధపడుతున్నారని తేలింది. డయాబెటిస్ రుగ్మత “ఓ నిశ్శబ్ద విధ్వంసం”గా రూపాంతరం చెందుతున్నది. భారత్‌లో అత్యధికంగా 100 మిలియన్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2015 వివరాల ప్రకారం 60 శాతం మంది పిల్లల్లో షుగర్ లెవల్స్ సాధారణం కన్న అతిగా ఉన్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా మధుమేహ రుగ్మత వల్ల మానవాళిపై అత్యంత సామాజిక ఆర్థిక భారం పడుతున్నది. భారత్‌లోని గోవా(26.4%), పుదుచ్చేరి(26.3%), కేరళ (25.5%) రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యధికంగా మధుమేహం ఉన్నట్లు తేలగా, యూపీలో అత్యల్పంగా 4.8 శాతం మాత్రమే ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందువల్లనే గోవా/కేరళ రాష్ట్రాలను “భారత మధుమేహ రాజధానులు”గా పిలుస్తున్నాం. కేవలం ఢిల్లీ మహానగరంలోనే 29.8 లక్షల మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారని విశ్లేషించబడింది. దేశ మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో దాదాపు మూడవ వంతు పట్టణాల్లోనే ఉన్నారని, గ్రామీణుల్లో డయాబెటిస్ తక్కువగా ఉన్నట్లు గమనించారు.

అవరోధాల్ని ఛేదిద్దాం, అంతరాలను పూడ్చుదాం:

మధుమేహ వ్యాధి వ్యాప్తి పెరగడం, ప్రమాదకరంగా మారడంతో దాని పట్ల ప్రజల్లో అవసర అవగాహనను కల్పించడానికి 1992 నుంచి ప్రతి ఏట 14 నవంబర్ రోజున “ప్రపంచ మధుమేహ దినం” పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ మధుమేహ దినం–2026 ఇతివృత్తంగా “మధుమేహం పట్ల ముందస్తు చర్యలు (ఎర్లీ ఆక్షన్ ఆన్ డయాబెటిస్)” అనే అంశాన్ని తీసుకున్నారు. కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న “ఫ్రెడ్రిక్ బాంటింగ్” గౌరవార్థం వారి జన్మదినం సందర్భంగా 14 నవంబర్‌ను ప్రపంచ డయాబెటిస్ దినం పాటిస్తున్నాం. మధుమేహ వ్యాధికి గల కారణాలు, వ్యాధి లక్షణాలు, నియం త్రణ మార్గాలు, చికిత్స విధానాల పట్ల అవగాహన కలిగిస్తూ “మధుమేహ నిశ్శబ్ద విధ్వంసాన్ని” ఆపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

మధుమేహానికి ఊతం ఇవ్వగల కారణాలు:

భారత్‌లో మధుమేహం కోరలు చాచడానికి ప్రధాన కారణాలుగా ఆర్థిక/పోషకాహార మార్పులు, స్థూలకాయం, అధిక కాలరీలు/కొవ్వులు/షుగర్స్ కలిగిన ఆహారాలను లొట్టలేసుంటూ తినడం, ఇన్సులిన్ నిరోధకత, శారీరక శ్రమ లోపించడం, సంపన్న జీవనశైలిని కౌగిలించుకోవడం, అధిక పని భారం, మానసిక ఒత్తిడి పెరగడం, ఫాస్ట్/జంక్ ఫుడ్ తినడం, పొగ/ఆల్కహాల్ తాగడం లాంటి పలు అంశాలు దోహదపడుతున్నాయి.

నివారణ/నియంత్రణ మార్గాలు:

మధుమేహ భూతాన్ని తరిమడానికి జీవనశైలిలో సానుకూల మార్పులు చేసుకోవడం ప్రధానమైనది. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ కనీసం 30 నిమిషాలు చేయడం, పొగ/ఆల్కహాల్ తాగడాన్ని మానుకోవడం, గంటల తరబడి కూర్చొని నిశ్చల స్థితిలో పని చేయడాన్ని తప్పించడం, వైద్యుల సలహాలను తరుచుగా తీసుకోవడం, షుగర్ పరీక్షలను చేయించుకోవడం లాంటి మార్పులు చేసుకోవాలి.

మధుమేహ వ్యాధి లక్షణాలు:

మధుమేహం మూడు రకాలుగా కనిపిస్తుంది. టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్, గెస్టేషనల్ (గర్భిణి స్త్రీల్లో) డయాబెటిస్ అనే మూడు రకాల మధుమేహ వ్యాధిగ్రస్తులు కనిపిస్తారు. టైప్ 1 మధుమేహం చిన్నతనంలోనే రావచ్చు. దీనిని నిరోధించలేము. నియంత్రించగల టైప్ 2 డయాబెటిస్ వ్యాధి 40 ఏండ్లు దాటిన వారిలో అధికంగా కనిపిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 90 శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడ్డారని తెలుస్తున్నది. శరీరానికి అవసరమైన ఇన్సులిన్ విడుదల కాకపోవడం లేదా అవసరానికి మించి షుగర్స్ తినడం వల్ల మధుమేహం ప్రారంభమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు, స్ట్రోక్, కాళ్లు చేతి భాగాల తొలగింపు, బిపీ, పుండ్లు మానకపోవడం, దాహంగా ఉండడం, తరుచుగా మూత్రం రావడం, బరువు తగ్గడం, బలహీనంగా ఉండడం, అలసట, మానసిక ఉద్రిక్తతలు, కంటి చూపు మందగించ డం, నాడీమండలం ప్రభావి తం కావడం, మూత్ర పిండాలు చేడు పోవడం, కంటి చూపుపై ప్రభావం పడడం, వినికిడి సమస్యలు ఉత్పన్నం కావడం, కాళ్ల ఇబ్బంది, అల్జీమర్స్ వ్యాధి రావడం, చర్మ/చిగు ర్లలో ఇన్‌ఫెక్షన్స్ లాంటి తీవ్రమైన జబ్బులు లేదా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒకసారి డయాబెటిస్ నిర్ధారణఅయితే జీవితకాలం దానిని పెరగకుండా అదుపులో ఉండే విధంగా నియంత్రించుకోవడమే ఏకైక మార్గంగా తెలుస్తున్నది. ఇలాంటి జీవనశైలి రుగ్మతలు దరికి చేరకుండా చూసుకోవడమే ఉత్తమం. చాప కింద నీరులా “సైలెంట్ కిల్లర్” రూపంలో ప్రపంచ మానవాళిని కుదిపే సేందుకు సిద్ధంగా ఉన్న మధుమేహాన్ని దగ్గరకు రాకుండా చూసుకోవడానికి సిద్ధంగా ఉందాం, డయాబెటిస్‌ను కట్టడి చేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే

వినోబా భావే (1895–1982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు.



వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్ర లోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించి నప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు.

1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను “వినోబా” అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు.

1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పొచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదులకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది.

వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. “సర్వోదయం” అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.

వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామస్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయం-పోషణకు ప్రాముఖ్యతనిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు.

వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది “గీతా ప్రవచన్”, ఇది భగవద్గీత పై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీత పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి.

వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు.

ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం -- ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజ సేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

రైతు పండిస్తే రూ.30.. వ్యాపారి అమ్మితే రూ.70!

రైతు నోట్లో మట్టి.. వ్యాపారుల జేబుల్లో కోట్లు?

తెలంగాణలో బియ్యం ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. బియ్యం కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పౌరసరఫరాల శాఖ ఖండించడమే కాకుండా వివిధ రకాల బియ్యానికి గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించింది. బీపీటీ, కేఎన్ఎం రకాల బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల బియ్యం రూ.79గా ధరలను ప్రకటించింది. నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సామాన్య వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమంజసమే. కానీ ఇక్కడే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బియ్యం ధరలు పెరిగితే వెంటనే స్పందించే ప్రభుత్వానికి ధాన్యం పండించిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోతే ఎందుకు స్పందన ఉండటం లేదు?

పంట పండించేది రైతు.. ధర నిర్ణయించేది వ్యాపారా?

రైతు విత్తనం వేసిన రోజు నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎన్నో కష్టాలు పడతాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, సాగునీరు, విద్యుత్, యంత్రాల అద్దెలు, కోతలు, రవాణా ఇలా ప్రతి దశలోనూ పెట్టుబడి పెడతాడు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, తెగుళ్లు ఎదురైనా పంటను కాపాడుకోవడానికి శ్రమిస్తాడు. చివరకు ధాన్యం చేతికి వచ్చినప్పుడు మాత్రం దాని ధర నిర్ణయించే అధికారం అతని చేతిలో ఉండదు. అప్పులు తీర్చాలి, కుటుంబాన్ని పోషించాలి, పిల్లల చదువులు కొనసాగించాలి, తదుపరి పంటకు పెట్టుబడి సమకూర్చుకోవాలి. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరకు ధాన్యం విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పంట పండించే రైతుకు ధర నిర్ణయించే అవకాశం లేకపోవడం వ్యవసాయ వ్యవస్థలోని ప్రధాన లోపం.

రూ.3 వేల ధాన్యం.. రూ.7 వేల బియ్యం!

క్వింటాల్ ధాన్యం సుమారు రూ.3 వేల ధర పలుకుతుంటే, అదే ధాన్యం నుంచి తయారైన



బియ్యం క్వింటాల్ సుమారు రూ.7 వేల వరకు విక్రయించే పరిస్థితి కనిపిస్తోంది. అంటే రైతు ఉత్పత్తి చేసిన ముడిసరుకుకు లభిస్తున్న ధరకు, వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. అయితే ఈ వ్యత్యాసమంతా వ్యాపారుల లాభమేనని చెప్పడం సరైంది కాదు. ధాన్యాన్ని మరపట్టడానికి విద్యుత్, కార్మికుల వేతనాలు, రవాణా, నిల్వ, ప్యాకింగ్ వంటి ఖర్చులు ఉంటాయి. బియ్యంతో పాటు నూకలు, తవుడు, పొట్టు వంటి ఉప ఉత్పత్తులు కూడా వస్తాయి. వీటి విలువను కూడా లెక్కించాలి. కానీ అన్ని ఖర్చులు పోను మిల్లర్లు, వ్యాపారులకు మిగులుతున్న లాభమెంత? రైతుకు అందుతున్న వాటా ఎంత? ప్రభుత్వం ఈ లెక్కలను ఎందుకు ప్రజల ముందుంచడం లేదు? ఇదే అసలు ప్రశ్న.

రైతు నష్టపోతే పట్టించుకునేది ఎవరు?

బియ్యం ధరలు పెరిగితే వినియోగదారులపై భారం పడుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. మరి ధాన్యం ధరలు పడిపోయినప్పుడు రైతులపై పడే భారం గురించి ఎవరు ఆలోచించాలి? కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే సరిపోదు. ఆ ధరకు కొనుగోళ్లు జరిగేలా చూడాలి. తేమ శాతం, నాణ్యత, తరుగుదల పేరుతో రైతుల ధాన్యానికి అన్యాయమైన కోతలు విధించకుండా పర్యవేక్షించాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరిగితే రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా భావించే కొందరు వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు అప్పుల ఒత్తిడిలో ఉన్నప్పుడు తన పంటను నిల్వ చేసుకునే స్థోమత ఉండదు. చివరకు వచ్చిన ధరకు అమ్ముకొని నష్టాన్ని భరించాల్సి వస్తోంది.

ధరల నియంత్రణలో రైతుకు న్యాయం ఎక్కడ?

ప్రభుత్వం బియ్యం విక్రయ ధరలకు గరిష్ట పరిమితులు విధించడం ఎంత ముఖ్యమో, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం కూడా అంతే ముఖ్యం. వినియోగదారుడికి తక్కువ ధరకు బియ్యం అందించాలనే పేరుతో రైతు ఆదాయాన్ని తగ్గించడం పరిష్కారం కాదు. మిల్లర్లు, వ్యాపారులు తమ పెట్టుబడికి తగిన న్యాయమైన లాభం పొందాలి. అదే సమయంలో రైతు కూడా తన సాగు ఖర్చులు తిరిగి పొందడంతో పాటు తగిన ఆదాయం పొందాలి. ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ధాన్యం కొనుగోలు చేసిన పరిమాణం, మిల్లింగ్ అనంతరం వచ్చిన బియ్యం, ఉప ఉత్పత్తుల పరిమాణం, వాటి విక్రయ ధరలు, మిల్లింగ్ ఖర్చులపై ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేయాలి. ధాన్యం నుంచి బియ్యం వినియోగదారుడి చేతికి చేరే వరకు ప్రతి దశలో పారదర్శకత తీసుకురావాలి. కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రైతు విక్రయించిన ధాన్యానికి నిర్దిష్ట సమయంలోనే నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

రైతు బతికితేనే ఆహార భద్రత!

రైతు పండించిన ధాన్యం లేకుండా బియ్యం మార్కెట్‌లోకి రాదు. రైతు వ్యవసాయం నుంచి దూరమైతే భవిష్యత్తులో ఆహార ఉత్పత్తిపైనే ప్రభావం పడుతుంది. ఇప్పటికే పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న గిట్టుబాటు ధరలు, అప్పుల భారం రైతాంగాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం రైతు ఆదాయానికి భరోసా కల్పించాలి. బియ్యం ధరల నియంత్రణ చర్యలతో పాటు ధాన్యం ధరల విషయంలోనూ సమానమైన శ్రద్ధ చూపాలి. రైతుకు న్యాయమైన ధర లభిస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

పాలకులు ఆలోచించాల్సిన ప్రశ్న ఒక్కటే.. బియ్యం కిలో రూ.70కు విక్రయించే పరిస్థితిలో వినియోగదారుడి ప్రయోజనాల కోసం ధరలను నియంత్రిస్తున్న ప్రభుత్వం, అదే బియ్యానికి మూలమైన ధాన్యం పండించిన రైతుకు న్యాయమైన ధర కల్పించడానికి ఎందుకు సమానమైన చొరవ చూపడం లేదు? రైతు కష్టానికి విలువ లేకుండా వ్యాపార వ్యవస్థలో ధరల నియంత్రణకు అర్థమేమిటి? రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థకే నష్టం. వ్యాపారులకు న్యాయమైన లాభం, వినియోగదారుడికి అందుబాటు ధర, రైతుకు గిట్టుబాటు ధర.. ఈ మూడింటినీ సమన్వయం చేసినప్పుడే నిజమైన సంక్షేమం సాధ్యమవుతుంది. బియ్యం ధరలకు కళ్లెం వేయడం మాత్రమే పాలన కాదు.. ధాన్యం పండించిన రైతు కన్నీళ్లకు అడ్డుకట్ట వేయడమే నిజమైన రైతు సంక్షేమం!

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
సామాజిక రాజకీయాలపై విశ్లేషణ
9848559863





యూజ్ అండ్ త్రో

కడిగిన విస్తరాకులో అన్నం పెట్టుకొని..
లొట్టలేసుకుని తిని కడుపునిండగానే..
ఆకును మలిచేసి డస్ట్‌బిన్‌లో పడేస్తాం !

పేపర్ కప్పులోని టీని సుతారంగా..
జుర్రుతొని కప్పును ఖాళీ చేసిన క్షణమే..
నిర్దాక్షిణ్యంగా నలిపి బిన్‌లో వేసేస్తాం !

ఖరీదైన సిగరెట్‌ను ప్రేమతో కొనుక్కొని..
పెదాల మధ్య బంధించి పొగ వదులుతూ..
మిగిలిన సిగరెట్ పీకను కాళ్ల కింద నలిపేస్తాం !

దినపత్రిక రాకకు ఎదురుచూసి..
డైలీ పేపర్‌ను పూర్తిగా చదివేసి..
సాయంత్రానికే ముక్కలు చేసి పొట్లం కడతాం !

మనుషుల్ని అవసరానికి కౌగిలించుకొని..
చేతిలో చేయి వేసి పనులను ముగించేసి..
అవసరం తీరాక నడి రోడ్డుపై వదిలేస్తాం !

టిష్యూ పేపర్‌ను వాడి పడేసినట్లు..
ముసలి బెర్రెను కటికొళ్లకు అమ్మేసినట్లు..
యూజ్ అండ్ త్రో నేర్చుకున్నాడు నరుడు !

మధుపాళీ
9949700037



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పేట్ సంగం విద్యార్థులు!

కామారెడ్డి గాంధారి నవంబర్ 14(సింగిడి)గాంధారి:

గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభకు కొదవ లేదని పేట్ సంగం ఉన్నత పాఠశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ తమ సత్తా చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొస్తున్నారు.పేట్ సంగం ఉన్నత పాఠశాలకు చెందిన మూడ్ రామ్ చరణ్, తేజస్వినీ ఎస్‌జీఎఫ్ అండర్-14 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12న పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్ఆర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఉమ్మడి జిల్లా స్థాయిలోనూ అద్భుతంగా ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వీరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు.అదేవిధంగా గుడివేనక తండాకు చెందిన భూక్యా అర్జున్ అండర్-16 సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కామారెడ్డి జిల్లా తరఫున తన ప్రతిభను ప్రదర్శించనున్నాడు. ప్రస్తుతం అర్జున్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్‌లో శిక్షణ పొందుతున్నాడు.గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయికి ఎదుగుతున్న ఈ క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ప్రోత్సాహం, నిరంతర సాధన ఉంటే గ్రామీణ విద్యార్థులు సైతం క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఈ విజయాలు చాటుతున్నాయి.

ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు



కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)

ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు ఎల్లారెడ్డి పట్టణంలోని టీజీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య కేక్ కట్ చేసి బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య సంతోష కరమైన వాతావరణం నెలకొంది . బాలల ప్రాముఖ్యత తెలియజేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు ఎల్లారెడ్డి పట్టణంలోని టీజీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేస్తూ సంతోషకరమైన వాతావరణం నెలకొంది. పాలు గొన్నవారు ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షులు మెగావత్ కనిరాం బీసీ విద్యార్థి విభాగం లింగమయ్య ఎల్లారెడ్డి అసెంబ్లీ బహుజన నేత మర్ల సాయిబాబు ఎల్లారెడ్డి పట్టణం పదో వాడు బీసీ సంక్షేమ సంఘం ఇన్చార్జి నాయని అజయ్ కుమార్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఇంద్రనగర్ నాగరాజ్ మోడల్ బాలికల గృహ వసతి వార్డెన్ సుజాత ఏఎన్ఎం సులోచన హాస్టల్ యొక్క సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ



వేములవాడ,రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)

చందుర్తి మండల రామన్నపేట గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త బొడ్డు రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించగా, అలాగే నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కొలకాని నాగరాజు తండ్రి కొలకాని రాజయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సర్పంచులు మరాఠీ మల్లిక్, పోతురాజు భారతి నగేష్, నరేశ్ ఉప సర్పంచ్ ఎల్లయ్య, సీనియర్ నాయకులు తిప్పని శ్రీనివాస్, కిషన్ రావు, రమేష్ గౌడ్, పెంటయ్య, దుమ్ము ఆనంద్, బత్తుల కమలాకర్, తిరుపతి, శంకర్, బండి శ్రావణ్, కొమ్మ నపల్లి రాజశేఖర్, మరాఠీ భూపతి, ఉప్పల అంజయ్య, సంపునూరి మురళి, బొడిగె లస్మయ్య , దేశవేణి మురళి తదితరులు ఉన్నారు.

కల్లూరి రేణుక రాజును పరామర్శించిన చల్మెడ

సిరిసిల్ల పట్టణానికి చెందిన బిఆర్ఎస్ 36వ వార్డ్ కౌన్సిలర్ కల్లూరి రేణుక రాజు తల్లి కల్లూరి వెంకవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించగా కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు. పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. సీనియర్ నాయకులు ఏనుగు తిరుపతి రెడ్డి, రామతీర్థపు రాజు, నీలం శేఖర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు ప్రేమ్ చారి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 14 సింగిడి



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల్ మాచాపూర్ గ్రామానికి చెందిన మాచబోయిన అనుసవ్వ భర్త పరమేశ్వర్ (35) నిన్న సాయంత్రం 7:15 గంటల సమయంలో మల్లయ్యపల్లి గేట్ సమీపంలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య మాచబోయిన అనుసవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయడం జరిగింది.



వేములవాడ నవంబర్ 14 (సింగిడి)

ఆధ్యాత్మికతకు ప్రతీక కార్తీక వన మహోత్సవం

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఆధ్యాత్మికతకు,సామాజిక ఐక్యతకు ప్రతీక కార్తీక వన మహోత్సవం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు... శనివారం వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేములవాడ అర్బన్ అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక వన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ఆది శ్రీనివాస్‌కు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.అనంతరం విప్ ఆంజనేయ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కార్తీక మాసం భక్తి, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక సంప్రదాయాలకు ప్రత్యేకమైనదని, ఈ పవిత్ర మాసంలో నిర్వహించే వన మహోత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ప్రజల మధ్య ఆత్మీయత, అనుబంధాలు, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో సద్భావనను పెంపొందిస్తూ, మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆది ని పరామర్శించిన వేములవాడ డాక్టర్స్ బృందం

వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని వేములవాడ డాక్టర్స్ బృందం, 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత - అజయ్, వేములవాడ పట్టణ మున్నూరు కాపు కుల సంఘం గౌర అధ్యక్షులు నామాల పోచెట్టి, అధ్యక్షులు కోయినేని బాలయ్య ఈరోజు పరామర్శించడం జరిగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని వారు కోరుకున్నారు వారికి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎ ల్లవేళ లా ఉండాలని వారు ఆకాంక్షించారు



ఈ పరామర్శ కార్యక్రమంలో డాక్టర్ నామాల ప్రదీప్, డాక్టర్ కోయినేని రాజేందర్, డాక్టర్ పరశురాం, డాక్టర్ సందీప్ రెడ్డి, డాక్టర్ అనంద రెడ్డి, డాక్టర్ మురళీధర్ రావు, ఆకుల వేణు, 22 వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత- అజయ్, వేములవాడ పట్టణ మున్నూరు కాపు కుల సంఘం గౌరవ అధ్యక్షులు నామాల పోచేట్టి, కోయినేని బాలయ్య పాల్గొన్నారు.

ఓదెలలో వినూత్నంగా 'బాలల గ్రామసభ

పెద్దపల్లి నవంబర్ 14 (సింగిడి):

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'బాలల గ్రామసభ'ను ఓదెల గ్రామంలో సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి బాలల దినోత్సవం పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ఆవరణలో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మొదటిసారిగా బాలల గ్రామసభలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లల హక్కులను కాపాడటంతో పాటు, వారు చెడు అలవాట్ల బారిన పడకుండా సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు.



బెల్ట్ షాపుల నిషేధంపై కీలక నిర్ణయం

ప్రజల విజ్ఞప్తుల మేరకు ఓదెల గ్రామ పరిధిలో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తూ సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. యువత, మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. సభ అనంతరం చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన చిన్నారులకు సర్పంచ్ బహుమతులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మణ్, ఉపసర్పంచ్ గోపతి శ్రీలత, వార్డు సభ్యులు రాపెల్లి రాజయ్య, కొండ్ర లక్ష్మణ్, రాచర్ల అశోక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఒక్క గింజ కొంటలేరు

వడ్లు కొనంది.. ప్రారంభించి ఏం లాభం?
ప్రభుత్వ తీరుపై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 14 (సింగిడి):



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండల పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా, మండలంలోని ఏ కేంద్రం నుండి కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ ధాన్యం కొనుగోలు చేయలేదని ఆయన ఆరోపించారు. నిర్వాహకుల అలసత్వం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వడ్లు కొనంది కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభించి ఏం లాభమని ప్రభుత్వ తీరును తిరుపతి రెడ్డి ఎండగట్టారు.

రైతుల ఆవేదన

కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన రైతు కుమార్ తన గోడును నాయకుల ముందు వెళ్లబోసుకున్నారు. తాను ధాన్యం తెచ్చి పోసి 15 రోజులు గడుస్తున్నా, కనీసం తేమ శాతం పరీక్షించేందుకు కూడా నిర్వాహకులు రావడం లేదని ఆయన వాపోయారు. రోజులు గడుస్తున్న కొద్దీ పరదాల కిరాయి భారమవుతోందని, ఎండకు వడ్లు ఎండిపోయి తూకంలో నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రహీం, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నిదానపురం దేవయ్య, కాల్వ శ్రీరాంపూర్, మొట్లపల్లి, ఇప్పలపల్లి గ్రామాల మాజీ సర్పంచులు ఆడెపు శ్రీదేవి రాజు, గోనె శ్యామ్, మర్రి మహేందర్, ఇప్పలపల్లి ఉప సర్పంచ్ సంధ్యా-వేణు పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు సారంగాపాణి, వెన్నెల సదానందం, దండి అజయ్ కుమార్, జక్కెనపోయిన కనుకయ్య, బండారి ఓదెలు, యువ నాయకులు కుంట శ్రీకాంత్, కుంభం రాజు ముదిరాజ్ స్థానిక రైతులు హాజరయ్యారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు

ట్రాన్స్ జెండర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన వేములవాడ పోలీసులు
-ట్రాన్స్ జెండర్ల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది

వేములవాడ నవంబర్ 14 (సింగిడి)



జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు ఈరోజు వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో వేములవాడ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లతో ప్రత్యేక స మావేశ ంనిర్ వహించారు. ఈ సందర్భంగా వేములవాడ డీఎస్పీశ్రీనివాసులుమాట్లాడుతూవేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇతర దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులుకలిగించరాదని సూచించారు. శాపనార్థాలు పెట్టడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం,శుభకార్యాల వద్ద అక్రమవసూళ్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలపై ఫిర్యాదులు అందితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లుమాట్లాడుతూట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖఎల్లప్పుడూ అందుబాటులోఉంటుందని తెలిపారు. వారి గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా ప్రవర్తించినా, వేధించినా, దూషించినా లేదా ఉపాధి, సంక్షేమానికి సంబంధించిన సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా తమ సమస్యలను తెలియజేసి న్యాయం పొందవచ్చని తెలిపారు.ట్రాన్స్‌జెండర్లను ఎవరైనావేధించినా,అవమానించినా లేదా వారి హక్కులకు భంగం కలిగించినా ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ యాక్ట్2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈసమావేశంలో వేములవాడ పట్టణ సి.ఐ వీర ప్రసాద్,రూరల్ సి.ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి
సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నెహ్రూ పార్క్ లో నిర్వహించిన, భారత దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి.

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)



సిరిసిల్ల పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ.భారతదేశ తొలి ప్రధానిగా విశేష సేవలు అందించిన పండిత్ జవహర్ లాల్ నెహ్రూ 137 వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నెహ్రూ చిన్నపిల్లలంటే ఎంతో ప్రేమ ఇష్టం ఉండేది పిల్లలు కూడా వారిని ఎంతో ప్రేమగా చాచా అని పిలిచేవారని గుర్తు చేస్తూ చాచా నెహ్రూ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా బాలల దినోత్సవం కూడా నిర్వహించుకుంటున్నామని అన్నారు.నేటి బాలలే రేపటి భావి భారత ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వారే రేపటి తరానికి భవిష్యత్తు అని అన్నారు.ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రక్షణ , మంచి స్వేచ్ఛపూరిత వాతావరణం కల్పించడం ప్రభుత్వల బాధ్యత ప్రజలందరూ ఇందుకు సహకరిస్తూ పిల్లలకు రక్షణగా నిలుస్తూ వారి హక్కులను పరిరక్షణకు కృషి చెయ్యాలని అన్నారు.పిల్లల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, దేశభక్తి, కుటుంబ విలువలను, సేవాభావంను పెంపొందించాలని అన్నారు. భయంతో వారిని అనవసరంగా నిరుత్సాహ పరుస్తూ సోమరులుగా తయారు చేయకుండ ఆన్లైన్ గేమ్స్ వంటి వాటికి పిల్లలు అలవాటు పడకుండ చూస్తూ వారిని క్రీడల పట్ల వారి అభిరుచి వరకు ఇతర మంచి కళల పట్ల ప్రోత్సహించాలని ఈ సందర్భంగా అన్నారు...ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు వేముల రాములు, దార్నం అరుణ లక్ష్మీనారాయణ, ఎర్రం వెంకట్రాజ్యం , దొంతునేని కళ్యాణి అశోక్ రావు , కూర భాగ్యలక్ష్మి దేవరాజ్ , ఎలుక వెంకటేశం ,అడిచెర్ల రూప సాయి కృష్ణ , బత్తుల రమేష్ , రిక్కమల్లె రజిత సంపత్ , అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పాటి కుమార్ రాజు, మాజీ కౌన్సిలర్ రిక్కమల్లె సంపత్ మొదలగు పుర ప్రముఖులు ప్రజలు పాల్గొని నెహ్రూ పూలమాలతో ఘన నివాళులర్పించారు..

హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడొద్దు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 14 (సింగిడి)



ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని. టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారిని మరింత ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు తమ హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ విద్యార్థులకు హాస్టళ్లు ఎంతో కీలకమని, అలాంటి వసతి సౌకర్యాలను మూసివేయాలని చూడటం వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంద న్నారు. యూనివ ర్సిటీలోని ఈ-1, ఈ-2, డీ-బ్లాక్ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు.విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు ఉద్యోగాల కోసం నిరంతరం శ్రమిస్తున్న విద్యార్థుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల ఆందోళనలను అర్థం చేసుకొని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.హాస్టళ్లను యథావిధిగా కొనసాగించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పార్టీ, టీఆర్ఎస్వీ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని కంచర్ల రవి గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె అప్రోచ్. ఆరేల్లి వినయ్. సదుల శేఖర్. కల్యాదపు వినయ్, వాల్సా అక్షయ్, కంభోజి హర్షిత్, అన్నడి మింటు, సందవేని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పీపైఎల్ 9వ మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరుముల్ల తిరుపతి

పెద్దపల్లి ప్రతినిధి
నవంబర్ 14 (సింగిడి):



పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ప్రగతిశీల యువజన సంఘం (పీపైఎల్) జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కానిపేట ధర్మేందర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం పీపైఎల్ పెద్దపల్లి జిల్లా 9వ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీపైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరుముల్ల తిరుపతి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు నిరుద్యోగ సంఖ్య విపరీతంగా పెరుగుతోందని, స్వయం ఉపాధి కరవై యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్య పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. దేశభక్తి ముసుగులో మతం, మూఢ నమ్మకాలు, కులాల పేరుతో యువతను తప్పుదారి పట్టిస్తూ వారి శక్తిని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, విదేశీ విష సంస్కృతితో పాటు అశ్లీల చిత్రాలు యువ శక్తిని నూనె తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గట్టిగా డిమాండ్ చేశారు. నవంబర్ 22న గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ప్రగతిశీల యువజన సంఘం పెద్దపల్లి జిల్లా 9వ మహాసభలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల ప్రారంభోపన్యాసకులుగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఐయి కృష్ణ, ముఖ్య వక్తలుగా పీపైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే. ల క్ష్మీనారాయ ణ , ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిలుక శంకర్ తదితరులు హాజరై ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. రాబోయే కాలంలో చేపట్టాల్సిన భవిష్యత్ కర్తవ్యాలను ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించి రూపొందించుకుంటామని తెలిపారు. కాబట్టి యువతీయువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీపైఎల్ జిల్లా నాయకులు బి. ఆనంద్, సమ్మెట తిరుపతి, ఈదునూరి బాబు, పోరండ్ల రాజేందర్, ప్రేమ్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం
సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి .పి.లక్ష్మణాచారి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 14 (సింగిడి)





బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, భద్రత పట్ల ప్రతి ఒక్క రూబాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి .పి.లక్ష్మణాచారి అన్నారు.జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, సిరిసిల్లలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు.పి.నీరజ సూచనలతో నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన 2024 ప్రకారం విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సెక్రటరీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాలలందరికీ విద్య, ఆరోగ్యం, రక్షణ, గౌరవప్రదమైన జీవనం పొందే హక్కులు ఉన్నాయని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు వంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించ



భారత్ సమ్మిట్’కు వ్యతిరేకంగా బీజేపీ నిరసన

కరీంనగర్, నవంబర్14(సింగిడి)

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘భారత్ సమ్మిట్’ను వ్యతిరేకిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం నేతృత్వంలో శనివారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయగా, అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో కార్యకర్తలకు తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్తత నెలకొని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సాయిని మల్లేశంతో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ, ‘భారత్ సమ్మిట్’ పేరుతో నిర్వహిస్తున్నది దేశ వ్యతిరేక సమ్మిట్ అని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని విమర్శించారు.నిరసనలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు

కరీంనగర్, నవంబర్ 14(సింగిడి)



కరీంనగర్ జోన్ పరిధిలోని నారాయణ పాఠశాలల విద్యార్థులకు నగరంలో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, మానసిక వికాస కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన నిపుణులతో శిక్షణ అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బన్సీలాల్, హెచ్‌ఆర్ మౌళి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్యరావు, ఆర్ఐ సత్యంరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

మానేరు విద్యాసంస్థల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



కరీంనగర్,నవంబర్14(సింగిడి)

నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంప్రదాయ, ఆధునిక వస్త్రధారణలతో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులే దేశ భవిష్యత్తు అని, వారి ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆనందకరమైన వాతావరణంలో విద్య అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జిలు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారమిత వరల్డ్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం



కరీంనగర్, నవంబర్ 14(సింగిడి)

పారమిత వరల్డ్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలు, నృత్యాలతో పాటు చిన్నారుల వస్త్రధారణ ప్రదర్శన నిర్వహించారు. రంగురంగుల దుస్తుల్లో చిన్నారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన కళాకృతులు, హస్తకళా వస్తువులు, సాంకేతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి.యు.ఎం. ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్ మాట్లాడుతూ విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసూన, సమన్వయకర్త దీప్తిరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13 ఏళ్లుగా సొంత ఖర్చులతో ఆశ్రమ నిర్వహణ..
వృద్ధులకు కన్నకొడుకుల్లా సేవలు
మరణించినా కొడుకుల్లా అంత్యక్రియలు..
వైద్యం అందిస్తూ మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తున్న శ్రీనివాస్ దంపతులు

అనాథ వృద్ధులకు అండగా ‘అమ్మ అనాథ ఆశ్రమం’!

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)





కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొందరు పిల్లలు.. వృద్ధాప్యంలోకి వచ్చిన తల్లిదండ్రులను భారంగా భావిస్తూ దూరం చేసుకుంటున్న ఈ రోజుల్లో ఆ అనాథ వృద్ధులకు అమ్మలా అండగా నిలుస్తోంది ఓ ఆశ్రమం. వృద్ధాప్యంలో ఆదరించేవారు లేక, కనీసం పట్టించుకునే వారు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న వృద్ధులకు ఓ కుటుంబంలా మారింది. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలోని ‘అమ్మ అనాథ ఆశ్రమం’. 13 ఏళ్లుగా సేవలు అందిస్తూ అందరికి ఆలోచింపజేస్తుంది.13 ఏళ్లుగా సేవా ప్రయాణంఆశ్రమ నిర్వాహకులు గడ్డం తిరుమల శ్రీనివాస్ దంపతులు గత 13 సంవత్సరాలుగా సొంత ఖర్చులతో ఈ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. వృద్ధాప్యంలో ఆదుకునే వారు లేక ఆశ్రమానికి చేరిన వారికి అన్నం పెట్టడమే కాకుండా, వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన మందులు, వైద్య సేవలు అందిస్తున్నారు.కన్నకొడుకుల్లా సేవలుకన్న తల్లిదండ్రులకు బుక్కెడు అన్నం పెట్టేందుకు కూడా వెనుకాడుతూ, వృద్ధాప్యంలో వారిని దూరం చేసుకుంటున్న కొందరు పిల్లల తీరుకు భిన్నంగా శ్రీనివాస్ దంపతులు ఆశ్రమంలోని వృద్ధులను తమ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా ఉంటూ, వారి అవసరాలను తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు.మరణించినా కొడుకుల బాధ్యతలుఆశ్రమంలో ఉంటూ వృద్ధులు ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలను సైతం కన్నకొడుకుల బాధ్యతగా భావించి శ్రీనివాస్ దంపతులే దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. బతికున్నప్పుడు ఆదరణ చూపడమే కాదు.. చివరి ప్రయాణంలోనూ ఒంటరిగా వదలకుండా మానవత్వాన్ని చాటుకుంటున్నారు.మానవత్వమే నిజమైన సేవసొంత కుటుంబ సభ్యులే వృద్ధులను పట్టించుకోని పరిస్థితుల్లో, ఎలాంటి లాభాపేక్ష లేకుండా 13 ఏళ్లుగా సొంత ఖర్చులతో ఆశ్రమాన్ని నడుపుతూ వృద్ధులకు సేవలు అందిస్తున్న గడ్డం తిరుమల శ్రీనివాస్ దంపతుల సేవలు అభినందనీయం. వృద్ధులను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, ప్రతి ఒక్కరిలో మానవత్వం వెల్లివిరియాలని వారి సేవా ప్రయాణం సమాజానికి చాటిచెబుతోంది.కన్నవారు దూరం చేసినా.. అమ్మ అనాథ ఆశ్రమం అక్కున చేర్చుకుంటోంది. ఆప్యాయతకు చిరునామాగా నిలుస్తూ వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

సొంత ఖర్చులతో 13 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం

అనాథలుగా, ఆదరించేవారు లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు అండగా నిలవాలనే ఆలోచనతో అమ్మ అనాథ ఆశ్రమాన్ని ప్రారంభించాం. గత 13 సంవత్సరాలుగా మా సొంత ఖర్చులతో ఆశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నాం.ఆశ్రమానికి వచ్చే వృద్ధులను మా కుటుంబ సభ్యులుగానే భావిస్తాం.వారికి సమయానికి భోజనం అందించడంతో పాటు అనారోగ్య సమస్యలు ఎదురైతే అవసరమైన మందులు, వైద్య సేవలు అందిస్తున్నాం. వృద్ధాప్యంలో ఉన్నవారికి ఆప్యాయత, ఆదరణ ఎంతో అవసరం.కన్నవారు దూరం పెట్టినప్పటికీ ఆశ్రమానికి వచ్చిన వారిని ఒంటరిగా భావించనివ్వకుండా చూసుకుంటున్నాం. ఆశ్రమంలో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలను కూడా మా కుటుంబ బాధ్యతగా నిర్వహిస్తున్నాం.వృద్ధులకు సేవ చేయడంలోనే మాకు ఆత్మసంతృప్తి ఉంది. చివరి శ్వాస వరకు వీలైనంత మందికి ఆశ్రయం కల్పిస్తూ సేవ చేయాలన్నదే మా లక్ష్యం” అని ఆశ్రమ నిర్వాహకులు గడ్డం తిరుమల శ్రీనివాస్ తెలిపారు.

అమ్మ అనాథ ఆశ్రమం నిర్వాహకులు గడ్డం తిరుమల శ్రీనివాస్ దంపతులు

బాన్సువాడలో కల్తీ కల్లు కలకలం!

పోచారం నుంచి దామరంచకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు
ప్రజారోగ్యంపై ఆందోళన
కల్లు సరఫరాపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి)



కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రాంతంలో కల్తీ కల్లు సరఫరా జరుగుతోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. పోచారం నుంచి దామరంచ గ్రామానికి కల్తీ కల్లు సరఫరా చేస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఆందోళనకు కారణమవుతోంది. ఈ వ్యవహారంపై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.కల్లు సహజసిద్ధమైన పానీయంగా భావించి వినియోగించే ప్రజలకు, అందులో ఎలాంటి హానికర పదార్థాలు కలిపినా ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కల్లు వినియోగించే వారి ఆరోగ్య భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అధికారుల తనిఖీలు తప్పనిసరిపోచారం ప్రాంతంలో కల్లు తయారీ కేంద్రాలు, దామరంచలో విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమానాస్పద కల్లు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపితే కల్తీ జరుగుతోందా లేదా అన్న విషయం స్పష్టమవుతుందని అభిప్రాయపడుతున్నారు.ఆరోపణల్లో వాస్తవమెంత?పోచారం నుంచి దామరంచకు కల్తీ కల్లు సరఫరా అవుతోందన్న ఆరోపణలపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ వెలువడలేదు. బాన్సువాడ ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సి ఉంది. సంబంధిత వ్యక్తుల వివరణ కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. ప్రతీ అర్హుడికి సంక్షేమ ఫలాలు

అర్హులైన 760 మంది పేదలకు నూతన పెన్షన్లు
760 కుటుంబాల్లో కొత్త వెలుగులు.. పెన్షన్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

మోటకొండూరు : నవంబర్ 14 (సింగిడి)





యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో అర్హులైన పేదలకు నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా యాదగిరిగుట్ట మండలం,పట్టణ పరిధికి చెందిన 760 మంది అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నూతన పెన్షన్ మంజూరు పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలు,వృద్ధులు,దివ్యాంగులు, ఒంటరి మహిళలు,ఇతర అర్హులైన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్ ఒక గొప్ప ఆర్థిక భరోసా అని, ప్రతి నెలా అందే పెన్షన్‌తో వారి నిత్యావసర అవసరాలకు ఎంతో తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. ఇబ్బందులు పడిన పేదలకు,నేడు ప్రజా ప్రభుత్వం పాలనను ప్రజల వద్దకే తీసుకువెళ్లి అర్హులకు పథకాలను అందిస్తోందని వివరించారు.అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన 760 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,సంబంధిత శాఖల అధికారులు,పెన్షన్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో 22 కేజీల గంజాయి స్వాధీనం



చేవెళ్ల, నవంబర్ 14 (సింగిడి)

చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అక్రమంగా తరలిస్తున్న సుమారు 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలో పరిధిలోని ఫారా కాలేజ్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అందిన విశ్వసనీయ సమాచారం మేరకు AP 39 WW 6222 రిజిస్ట్రేషన్ నంబర్ గల కారును ఆపి తనిఖీ చేయగా, అందులో గంజాయి బయటపడింది. నక్క నారాయణ, రాణిమేకల నాగరాజు ఇద్దరూ గన్నవరం గ్రామం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో నిందితులు విజయవాడ నుండి మహారాష్ట్ర రాష్ట్రానికి గంజాయిని రవాణా చెనుక ఉన్న ఇతర వ్యక్తులు ఎవరు అనే వివరాలపై పోలీసులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.



ఫిబ్రవరి దర్శన, వసతి కోటా విడుదలకు టీటీడీ షెడ్యూల్

నవంబర్ 18 నుంచి 24 వరకు ఆన్ లైన్ లో టికెట్లు, గదుల కోటా విడుదల

సిద్దిపేట, నవంబర్ 14 (సింగిడి)

ఫిబ్రవరి నెలకు సంబంధించి శ్రీవారి వివిధ ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, వసతి గదుల కోటాను టీటీడీ నవంబర్ 18 నుంచి 24వ తేదీ వరకు విడతలవారీగా ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది.నవంబర్ 18న ఆర్జిత సేవల ఎలక్ట్రానిక్ డిప్పుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల టికెట్ల కోటాను నవంబర్ 18న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు లభించిన వారు 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా సొమ్ము చెల్లించాలి.21న ఇతర ఆర్జిత సేవల టికెట్లుకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను అందుబాటులోకి తీసుకురానున్నారు. 23న ప్రత్యేక దర్శన టోకెన్లుఅంగప్రదక్షిణ టోకెన్లను 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లను ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి ఉచిత ప్రత్యేక దర్శన టోకెన్ల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు.24న ప్రత్యేక ప్రవేశ దర్శనం, గదుల కోటాప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల, తిరుపతిలోని వసతి గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దర్శన, ఆర్జిత సేవల టికెట్లు, వసతి గదులను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సేవలో సిద్దిపేట పోలీసులు ముందడుగు వేస్తున్నారు. ప్రజల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న సిద్దిపేట పోలీసులు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. కేవలం నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. పేదలకు సహాయం అందించడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించడం, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు వివరించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించడం, వృద్ధులు, నిరుపేదలకు అవసరమైన సహాయం అందించడం ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు. యువతలో మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.పోలీసులు అంటే కేవలం నేరస్తులపై చర్యలు తీసుకునే వారే కాకుండా సమాజ సంక్షేమంలోనూ భాగస్వాములనే భావనను ఈ కార్యక్రమాలు చాటిచెబుతున్నాయి. ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

సామాజిక సేవలోనూ సిద్దిపేట పోలీసులు

గంటల్లోనే బాలికల ఆచూకీ!
తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు క్షేమం..
తల్లిదండ్రులకు అప్పగింత

సిద్దిపేట, నవంబర్ 14 (సింగిడి)

సిద్దిపేటలో తప్పిపోయిన ఇద్దరు బాలికలను పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన లత తన కుమార్తె నిహారిక (13), సోదరి కుమార్తె రిషిక (9)లను పాఠశాలలో దింపేందుకు సిద్దిపేటకు తీసుకొచ్చారు. రంగధాంపల్లి చౌరస్తా వద్ద బస్సు కోసం వేచి ఉండగా పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేని బాలికలు తల్లికి తెలియకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారి ఆచూకీ కనిపించకపోవడంతో లత సిద్దిపేట-1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పి. మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు వెంటనే గాలింపు చేపట్టారు. బాలికలు పెద్దగుండవెల్లి వైపు వెళ్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని వారిని గుర్తించారు. అనంతరం క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన స్పందనపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు పోలీసుల కొత్తరూపు!

‘మన పోలీస్–మన ఊరు’ కార్యక్రమంలో భాగంగా హబ్సిపూర్ ప్రభుత్వ పాఠశాలకు పోలీసులు కొత్త అందాన్ని తీసుకొచ్చారు. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రవేశ ద్వారం, ప్రహరీ గోడలకు రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాలను సందర్శించిన సీపీ విద్యార్థులకు భోజన ప్లేట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి తయారు చేసిన బెన్సిళ్లను పంపిణీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందేందుకు ఉపయోగపడే డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పోలీసుల చొరవపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



డ్రంక్ అండ్ డ్రైవ్.. 30 మందికి జైలు!

35 కేసుల పరిష్కారం.. రూ.45 వేల జరిమానా విధింపు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో గజ్వేల్ కోర్టు 30 మందికి జైలు శిక్ష విధించింది. గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో మొత్తం 35 కేసులు పరిష్కారమయ్యాయి. 34 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.40 వేల జరిమానా విధించారు. మిగిలిన 30 మందికి ఒకటి నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్ష ఖరారు చేశారు. వీరిలో ఒక రోజు శిక్ష పడిన వారు ఎనిమిది మంది, రెండు రోజుల శిక్ష పడిన వారు ఏడుగురు, మూడు రోజుల శిక్ష పడిన వారు నలుగురు, నాలుగు రోజుల శిక్ష పడిన వారు ఏడుగురు, ఐదు రోజుల శిక్ష పడిన వారు నలుగురు ఉన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించారు. మొత్తం రూ. 45 వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమేకాకుండా, సొంత ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయని తెలిపారు.మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీపీ సూచించారు. రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ అత్యంత ప్రాధాన్యమివ్వాలని కోరారు.

రష్మీ పెరుమాళ్, పోలీస్ కమిషనర్ సిద్దిపేట

ఉదయాన్నే వీటిని ట్రై చేయండి

ఉదయం ఆఫీసుకు వెళ్లాల్సిన రోజుల్లో కొత్త ఆహారపు అలవాట్లను, జీర్ణక్రియను ప్రభావితం చేసే చిట్కాలను అప్పటికప్పుడు ప్రయత్నించడం ఇబ్బందులకు దారితీయవచ్చు. కొందరికి కడుపు ఉబ్బరం, విరేచనాలు, కడుపునొప్పి, వికారం వంటి సమస్యలు రావచ్చు. దీంతో ఆఫీసులో పనిపై దృష్టి పెట్టలేకపోవడమే కాకుండా తరచూ వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి రావచ్చు. మరి ఉదయం ఆఫీసుకు వెళ్లే ముందు ఎలాంటి ఆహారాలు, ఆరోగ్య చిట్కాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి?



1. పరగడుపున కలబంద జ్యూస్ తాగుతున్నారా?
కలబంద ఆరోగ్యానికి మంచిదని చాలామంది ఉదయాన్నే ఖాళీ కడుపుతో జ్యూస్ తాగుతుంటారు. చర్మ సౌందర్యం, జీర్ణక్రియ వంటి ప్రయోజనాల కోసం దీనిని తీసుకుంటారు. అయితే కలబందలోని కొన్ని పదార్థాలు విరేచనాలకు కారణమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కలబంద ఆకులోని పసుపు రంగు లేటెక్స్ పదార్థం పేగులపై విరేచనకారిగా పనిచేస్తుంది. అందుకే కలబంద జ్యూస్‌ను ఎప్పుడు పడితే అప్పుడు తీసుకోకూడదు. ఆఫీసుకు వెళ్లే ముందు ప్రయత్నించడం మంచిది కాదు.

2. గుమ్మడికాయ జ్యూస్‌తోనూ జాగ్రత్త!
గుమ్మడికాయలో పోషకాలు ఉంటాయి. అందుకే కొందరు ఉదయాన్నే జ్యూస్ రూపంలో తీసుకుంటారు. అయితే జ్యూస్ తయారీలో ఉపయోగించే గుమ్మడికాయ రకం, పరిమాణం, వ్యక్తుల జీర్ణశక్తిని బట్టి అనుభవాలు మారవచ్చు. ముఖ్యంగా చేదుగా ఉండే గుమ్మడికాయను మాత్రం అస్సలు తీసుకోకూడదు. అందులో ఉండే కుకుర్బిటాసిన్స్ అనే పదార్థాలు వాంతులు, విరేచనాలు వంటి సమస్యలకు కారణమవుతాయి. కొత్తగా ఇలాంటి జ్యూస్‌లు ప్రయత్నించాలనుకుంటే ముందుగా శరీరానికి ఎలా సరిపోతున్నాయో గమనించాలి.

3. రాగి ముద్దను రాత్రిపూట అతిగా తినొద్దు!
రాగుల్లో ఫైబర్, ఖనిజాలు ఉంటాయి. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చాలామంది రాగి ముద్దను తీసుకుంటారు. అయితే ఇంతకుముందు రాగి ఆహారం ఎక్కువగా తీసుకోని వారు ఒక్కసారిగా పెద్ద మోతాదులో తినకూడదు. ఇందులోని ఫైబర్ కారణంగా కొందరికి గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. ముఖ్యంగా రాత్రిపూట ఎక్కువగా తిని వెంటనే పడుకుంటే అసౌకర్యం కలగవచ్చు. ఉదయం తినడం సౌకర్యంగా అనిపించినా, పరిమాణం విషయంలో జాగ్రత్త అవసరం. కొత్తగా అలవాటు చేసుకునేవారు కొద్దిగా ప్రారంభించాలి.

4. పాట్ట శుభ్రం చేసే చిట్కాలు ముఖ్యమైన రోజుల్లో వద్దు!
మలబద్ధకం సమస్య ఉన్నప్పుడు చాలామంది ఇంటి చిట్కాలు ప్రయత్నిస్తుంటారు. మరికొందరు విరేచనాలు కలిగించే మందులు లేదా హెర్బల్ డ్రింక్స్ తీసుకుంటారు. వీటివల్ల ఉదయం పూట మలవిసర్జన ఎక్కువసార్లు కావచ్చు. కడుపునొప్పి, నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కూడా రావచ్చు. ముఖ్యంగా ఆఫీసులో ముఖ్యమైన మీటింగ్‌లు, ఇంటర్వ్యూలు, ప్రయాణాలు ఉన్న రోజుల్లో వైద్యుల సూచన లేకుండా కొత్త లాక్సేటివ్స్ లేదా పొట్ట శుభ్రం చేసే చిట్కాలు ప్రయత్నించకూడదు.

5. రాత్రి మిగిలిన నాన్‌వెజ్‌ను ఉదయాన్నే తింటున్నారా?
చాలామంది రాత్రి వండిన చికెన్, మటన్, చేపల కూరలను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు ఉదయం టిఫిన్‌గా తింటుంటారు. అయితే వీటిని సరిగ్గా నిల్వ చేయకపోతే ఆహారం పాడై ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమవుతుంది. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు రావచ్చు. మరోవైపు అధిక నూనె, మసాలాలతో చేసిన నాన్‌వెజ్ ఆహారం కొందరికి కడుపు భారంగా అనిపించేలా చేస్తుంది. దీంతో అసౌకర్యం, నీరసం కలగవచ్చు. నాన్‌వెజ్ తింటే నిద్రమత్తు తప్పనిసరిగా వస్తుందని కాదు. ఆహారం పరిమాణం, నిద్ర, జీర్ణక్రియ కూడా ప్రభావం చూపుతాయి.

6. పరగడుపున నిమ్మరసం, వెనిగర్ ప్రయోగాలు వద్దు!
బరువు తగ్గాలని, పొట్ట తగ్గించుకోవాలని కొందరు ఉదయాన్నే పరగడుపున నిమ్మరసం, ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపిన నీటిని తాగుతుంటారు. అయితే ఇవి అందరికీ సరిపోవు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ సమస్యలు, యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారికి మంట, అసౌకర్యం పెరగవచ్చు. వెనిగర్‌ను ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల పళ్ల ఎనామెల్ దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది. ఆఫీసుకు వెళ్లే ముందు ఇలాంటి కొత్త ప్రయోగాలు చేయడం కంటే సాధారణ నీటిని తాగడం మంచిది.

7. అధిక ఫైబర్ ఆహారాన్ని ఒక్కసారిగా తీసుకోవద్దు!
ఫైబర్ ఆరోగ్యానికి ఎంతో అవసరం. మలబద్ధకాన్ని తగించడంలోనూ సహాయపడుతుంది. అయితే రోజూ తక్కువ ఫైబర్ తీసుకునేవారు ఒక్కసారిగా ఓట్స్, చియా సీడ్స్, ఫ్లాక్స్ సీడ్స్, మొలకలు వంటివి అధికంగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు రావచ్చు. ముఖ్యంగా తగినంత నీరు తాగకపోతే ఇబ్బందులు మరింత పెరగవచ్చు. అందుకే ఫైబర్ ఆహారాన్ని క్రమంగా పెంచుకోవాలి.

8. ఉదయాన్నే ఎక్కువ కాఫీ తాగుతున్నారా?
ఆఫీసులో నిద్ర రాకుండా ఉండాలని చాలామంది ఉదయం లేవగానే ఒకటికి మించి కాఫీలు తాగుతుంటారు. మరికొందరు అల్పాహారం చేయకుండానే ఖాళీ కడుపుతో కాఫీ తాగుతారు. కెఫీన్ కొందరిలో పేగుల కదలికలను వేగవంతం చేసి మల విసర్జనకు కారణమవుతుంది. అలాగే యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట ఉన్నవారికి అసౌకర్యం కలగవచ్చు. కాబట్టి కాఫీ పరిమాణాన్ని నియంత్రించుకోవడం, అల్పాహారాన్ని నిర్లక్ష్యం చేయకపోవడం మంచిది.

9. కొత్త డైట్‌ను ఆఫీసు రోజునే ప్రారంభించొద్దు!
బరువు తగ్గాలని చాలామంది ఒక్కసారిగా ఆహారపు అలవాట్లను మార్చేస్తుంటారు. ఉదయం కేవలం జ్యూస్‌లు తాగడం, అల్పాహారం మానేయడం, కొత్త డైట్ ప్లాన్స్ ప్రారంభించడం వంటివి చేస్తారు. అయితే ఇలా చేయడం వల్ల కొందరికి ఆకలి, తలనొప్పి, నీరసం, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా శరీరానికి అలవాటు లేని డైట్‌ను ముఖ్యమైన పని ఉన్న రోజున ప్రారంభించడం కంటే ముందుగా ఆహార మార్పులను క్రమంగా చేసుకోవడం మంచిది.

గమనిక: ఆహార పదార్థాల ప్రభావం ఒక్కొక్కరి శరీరాన్ని బట్టి మారుతుంది. తరచూ విరేచనాలు, కడుపునొప్పి లేదా ఇతర జీర్ణ సమస్యలు ఎదురైతే వైద్యులను సంప్రదించాలి. కలబంద లేటెక్స్, చేదు గుమ్మడికాయ రసం వంటి వాటిని స్వయంగా ఆరోగ్య చిట్కాలుగా ఉపయోగించకూడదు.

గుప్పెడు బాదం..గొప్ప ప్రయోజనం

శీతాకాలం రాగానే మన ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తాయి. ఈ చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం చాలా ముఖ్యం.

ముఖ్యంగా, సూపర్‌ఫుడ్‌గా పిలువబడే బాదం పప్పులను ఈ సీజన్‌లో క్రమం తప్పకుండా తింటే అసాధారణమైన ఆరోగ్య లాభాలను పొందవచ్చు. బాదంలో విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి.

రోగనిరోధక శక్తి పెంపు:
చలికాలంలో జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్స్ వంటి సమస్యలు సర్వసాధారణం. బాదంలో ఉండే విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షిస్తాయి.

గుండె ఆరోగ్యం:
బాదంలో మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. రోజూ క్రమం తప్పకుండా బాదం తినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది.

చర్మాన్ని తేమగా ఉంచుతుంది:
చలికాలంలో చలిగాలుల కారణంగా చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. బాదంలోని విటమిన్-ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మానికి లోపలి నుంచి పోషణనిచ్చి, చర్మాన్ని కాంతివంతంగా, మృదువుగా ఉంచుతాయి

అతివ Athiva Singidi

పిల్లలకు మధుమేహం ముప్పు!



ఇటీవలే కాలంలో చిన్న పిల్లల్లో ఇన్సులిన్ నిరోధకత వంటి సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంకా దీనికి పిల్లల ఆహారపు అలవాట్లు, శ్రమ లేకపోవడం వంటివి ప్రధాన కారణాలు అని అంటున్నారు.

ముఖ్యంగా పిల్లలు ఇష్టంగా తినే ప్యాకెట్ ఫుడ్స్ విషయంలో తల్లిదండ్రులు కొంచం జాగ్రత్త అవసరం అని చెబుతున్నారు

బ్రేక్‌ఫాస్ట్, ఫ్లేవర్డ్ యోగర్ట్స్, ప్యాక్ చేసిన జ్యూస్ లు ఆరోగ్యకరమైన ఫుడ్ లా క నిపిస్తాయి. కానీ, వీటిలో చక్కెర, ఉప్పు, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇంకా వీటిని ఎక్కువగా పిల్లలకు ఇవ్వడం వలన బరువు పెరగడం, ఊబకాయం, జీవక్రియ సంబంధిత సమస్యలు వస్తాయని ఉందని నిపుణులు చెబుతున్నారు

జీవక్రియ లోపానికి సంబంధించిన హెచ్చరిక సంకేతాలలో నడుము చుట్టుకొలత పెరగడం, నిరంతర అలసట, మెడ, చంకల చుట్టూ చర్మం నల్లబడటం, అధిక రక్తపోటు , అసాధారణ కొలెస్ట్రాల్ లేదా రక్త గ్లూకోజ్ స్థాయిలు వంటివి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

పిల్లల్లో జీవక్రియ సమస్యలు ఉన్నప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు అంటున్నారు. ఇంకా పిల్లల నడుము చుట్టుకొలత ఎక్కువగా పెరగడం. ఇంకా పిల్లలు ఎప్పుడూ అలసటగా ఉండటం. మెడ, చంకల దగ్గర చర్మం నల్లగా మారడం. కొలెస్ట్రాల్, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వంటి లక్షణాలు కనిపిస్తే పిల్లల వైద్యుడి వద్దకు వెళ్లి టెస్ట్ లు చేపించాలి.

పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలి? ప్యాకెట్ ఫుడ్స్ కాకుండా మీ ఇంట్లో చేసే పోషకాహారాన్ని మీ పిల్లలకు పెట్టాలని డైటీషియన్లు చెబుతున్నారు. ఇంకా ఇడ్లీ, దోశ, వెజిటబుల్ ఉప్మా, వేయించిన శనగలు వంటి ఆహారాలను రోజూ ఇవ్వాలని చెబుతున్నారు. కూరగాయలు, పండ్లు, పప్పులు ఫుడ్ డైట్ లో చేర్చాలని చెబుతున్నారు.

రోజుకు రూ. 100 SIP.. 15 ఏళ్లలో కోటీశ్వరులు



మ్యూచువల్ ఫండ్స్‌లో రోజుకు రూ. 100 డైలీ సిప్, నెలకు రూ. 3,000 మంత్లీ సిప్ మధ్య 15 ఏళ్ల కాలంలో రూ. 22 వేల వ్యత్యాసం కనిపిస్తుంది. డైలీ సిప్ లో ఏడాదికి 365 రోజుల చొప్పున రూ. 500 అదనపు పెట్టుబడి వెళ్లడమే దీనికి కారణం. అయితే ఫ్రీక్వెన్సీ కంటే ఆదాయ మార్గాన్ని బట్టి క్రమశిక్షణతో దీర్ఘకాలం కొనసాగించడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

రోజుకు రూ. 100 vs నెలకు రూ. 3,000 SIP.. 15 ఏళ్లలో ఏది మిమ్మల్ని కోటీశ్వరులను చేస్తుంది?

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే సామాన్యులకు తరచుగా ఒక సందేహం వస్తుంటుంది. రోజుకు రూ. 100 చొప్పున 'డైలీ సిప్' (Daily SIP) చేయడం మంచిదా? లేక నెలకు ఒకేసారి రూ. 3,000 చొప్పున 'మంత్లీ సిప్' (Monthly SIP) చేయడం లాభదాయకమా? పైకి చూస్తే రెండూ ఒకటే అనిపిస్తాయి. ఎందుకంటే 30 రోజులకు వంద రూపాయల చొప్పున లెక్కిస్తే మూడు వేలే అవుతుంది కదా! కానీ దీర్ఘకాలంలో ఈ రెండు పద్ధతులు సృష్టించే సంపదలో ఆసక్తికరమైన తేడా ఉంది. సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనా ప్రకారం 5, 10, 15 ఏళ్ల కాలంలో ఏ విధానం ఎక్కువ డబ్బు ఇస్తుందో ఇప్పుడు స్పష్టంగా తెలుసుకుందాం.

డైలీ సిప్ లెక్కలు ఇలా ఉన్నాయి..
మీరు రోజుకు రూ. 100 చొప్పున ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే, ఏడాదికి 365 రోజులు కాబట్టి మీ మొత్తం పెట్టుబడి రూ. 36,500 అవుతుంది.
5 ఏళ్లలో: మీ అసలు రూ. 1.82 లక్షలు కాగా, రూ. 67,590 రాబడి వస్తుంది. మొత్తం విలువ రూ. 2.50 లక్షలకు చేరుతుంది.
10 ఏళ్లలో: మీ పెట్టుబడి రూ. 3.65 లక్షలు అవుతుంది. దీనికి రూ. 3.41 లక్షల లాభం జతకలిసి మొత్తం రూ. 7.06 లక్షలు అందుతాయి.
15 ఏళ్లలో: మీరు కట్టిన అసలు రూ. 5.47 లక్షలు అయితే, కాంపౌండింగ్ మాయాజాలం వల్ల రూ. 9.88 లక్షల రాబడి వస్తుంది. మొత్తంగా రూ. 15.36 లక్షల భారీ నిధి సిద్ధమవుతుంది.
మంత్లీ సిప్ ఎంత ఇస్తుంది?
ఇప్పుడు నెలకు ఒకేసారి రూ. 3,000 చొప్పున 12 శాతం రాబడి ఇచ్చే ఫండ్‌లో పెడితే, ఏడాదికి రూ. 36,000 పెట్టుబడి అవుతుంది.
5 ఏళ్లలో: అసలు రూ. 1.80 లక్షలకు రూ. 67,460 లాభం కలిసి రూ. 2.47 లక్షలు వస్తాయి.
10 ఏళ్లలో: అసలు రూ. 3.60 లక్షలు కాగా, రూ. 3.37 లక్షల రాబడితో మొత్తం విలువ రూ. 6.97 లక్షలకు చేరుతుంది.
15 ఏళ్లలో: మీరు పెట్టిన రూ. 5.40 లక్షలకు రూ. 9.74 లక్షల లాభం తోడై రూ. 15.14 లక్షలు చేతికి అందుతాయి.
అసలు తేడా ఎక్కడ వస్తోంది?
రెండు పద్ధతులను పోల్చి చూస్తే, 15 ఏళ్ల తర్వాత డైలీ సిప్ లో రూ. 22,000 అదనపు సంపద సమకూరింది. దీనికి ప్రధాన కారణం ఫ్రీక్వెన్సీ కంటే ఏడాదిలో మనం పెట్టే అసలు మొత్తమే! మంత్లీ సిప్ లో ఏడాదికి రూ. 36,000 మాత్రమే కడతాము. కానీ డైలీ సిప్ లో 365 రోజులు ఉండటం వల్ల ఏడాదికి రూ. 500 అదనంగా పెట్టుబడి వెళ్తుంది. 15 ఏళ్లలో ఆ అదనపు రూ. 7,500 కాంపౌండ్ అయి రూ. 22 వేల తేడాను చూపిస్తోంది.
ఈ అంశంపై హైదరాబాద్‌కు చెందిన సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. "చాలామంది డైలీ సిప్ చేస్తే మార్కెట్ ఒడిదుడుకుల్లో ఎక్కువ యూనిట్లు వస్తాయని భావిస్తారు. కానీ దీర్ఘకాలంలో డైలీ, మంత్లీ సిప్ రాబడుల మధ్య పెద్దగా వ్యత్యాసం ఉండదు. రోజూవారీ ఆదాయం పొందే చిరు వ్యాపారులకు డైలీ సిప్ అనుకూలంగా ఉంటుంది, నెలవారీ జీతం వచ్చే ఉద్యోగులకు మంత్లీ సిప్ సులభంగా ఉంటుంది" అని నిపుణులు సూచిస్తున్నారు.
చివరగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. రోజువారీ పెట్టుబడా, నెలవారీ పెట్టుబడా అనే దానికంటే మధ్యలో ఆపకుండా క్రమశిక్షణతో ఎక్కువ కాలం కొనసాగించడమే మిమ్మల్ని ధనవంతులను చేస్తుంది.

స్టాక్ మార్కెట్ Stock Market

నవంబర్‌లో కేవలం ఏడు రోజుల్లోనే విదేశీ ఇన్వెస్టర్లు రూ. 60,698 కోట్ల భారత షేర్లను కొనుగోలు చేశారు. నిఫ్టీ 50 కంపెనీల త్రైమాసిక లాభాలు 22.3 శాతం పెరగడం, లార్జ్, మిడ్ క్యాప్ వాల్యుయేషన్లు అందుబాటులోకి రావడంతో మార్కెట్లో మళ్లీ బుల్ రన్ మొదలైందన్న అంచనాలు బలపడుతున్నాయి. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

7 రోజుల్లోనే రూ. 60,698 కోట్లు



దాదాపు రెండేళ్ల అనిశ్చితి తర్వాత భారత స్టాక్ మార్కెట్ మళ్లీ కొత్త ఉత్సాహంతో పరుగులు తీసేందుకు సిద్ధమవుతోంది. విదేశీ ఇన్వెస్టర్ల భారీ కొనుగోళ్లు, కంపెనీల బలమైన త్రైమాసిక లాభాలు, అందుబాటులోకి వచ్చిన షేర్ల వాల్యుయేషన్లు ఒకేసారి సానుకూలంగా మారడం ఇన్వెస్టర్లకు పెద్ద ఊరటనిస్తోంది. మార్కెట్లో మళ్లీ 'బుల్ రన్' మొదలైందా అనే చర్చ దలాల్ స్ట్రీట్‌లో జోరుగా సాగుతోంది.

ఈ కీలక మార్పుపై క్యాపిటల్‌మైండ్ (Capitalmind) పోర్ట్‌ఫోలియో మేనేజర్ కృష్ణ అప్పల ఆసక్తికర విశ్లేషణ చేశారు. "గత వారం రెండు వారాలుగా మార్కెట్లో ఒక కొత్త మార్పు కనిపిస్తోంది. విదేశీ ఇన్వెస్టర్ల ఆలోచన 'భారత్ తప్ప ఎక్కడైనా సరే' అనే స్థాయి నుంచి 'భారత్ అత్యంత సురక్షితమైన మార్కెట్' అనే దిశగా మారింది. ఇది ఎంతకాలం కొనసాగుతుందో ఇప్పుడే చెప్పలేం కానీ, మార్కెట్‌కు ఇది చాలా మంచి పరిణామం" అని కృష్ణ అప్పల పేర్కొన్నారు.

ఐదేళ్ల గరిష్టానికి విదేశీ నిధుల ప్రవాహం
నవంబర్ నెలలోని కేవలం ఏడు ట్రేడింగ్ సెషన్లలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (FPI) ఏకంగా రూ. 60,698 కోట్ల విలువైన భారత షేర్లను కొనుగోలు చేశారు. 2021 జనవరి తర్వాత వరుసగా ఏడు రోజుల్లో నమోదైన అత్యధిక కొనుగోళ్లు ఇవే. అయితే, 2026 ఏడాది మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పటికీ రూ. 3.82 లక్షల కోట్ల నికర అమ్మకందారులుగానే ఉన్నారు. పైగా తాజా కొనుగోళ్లు కేవలం లార్జ్ క్యాప్ షేర్లకే పరిమితమయ్యాయి.

కంపెనీల లాభాల్లో 22 శాతం వృద్ధి
సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు భారత కార్పొరేట్ రంగం సత్తాను చాటాయి. నవంబర్ 10 నాటి గణాంకాల ప్రకారం, నిఫ్టీ 50 కంపెనీల సగటు నికర లాభం 22.3 శాతం పెరగగా, ఆదాయం 17.4 శాతం వృద్ధి చెందింది. నిఫ్టీ 500 కంపెనీల లాభాలు సైతం 20.4 శాతం ఎగబాకాయి. ముడి చమురు ధరలు ఎక్కువగా ఉన్నా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా మన కంపెనీలు లాభాలను కాపాడుకోవడం విశేషం.

అందుబాటులోకి వచ్చిన షేర్ల ధరలు
ప్రస్తుతం నిఫ్టీ 50 సూచీ తన భవిష్యత్ అంచనా ఆదాయాలకు 18 రెట్లు (P/E) వద్ద ట్రేడవుతోంది. ఐదేళ్ల సగటు 20.8 రెట్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. అలాగే నిఫ్టీ మిడ్ క్యాప్ 150 సూచీ కూడా చారిత్రక సగటు 30 రెట్ల కంటే తక్కువగా 25 రెట్ల వద్ద ఉంది. కానీ స్మాల్ క్యాప్ 250 సూచీ మాత్రం 29 రెట్ల వద్ద కాస్త ఖరీదుగానే కనిపిస్తోంది.
ఈ మూడు అంశాల కలయికపై కృష్ణ అప్పల స్పందిస్తూ.. "రెండేళ్ల నిరీక్షణ తర్వాత మూడు అంశాలు ఒకేసారి మనకు అనుకూలంగా మారాయి. మార్కెట్లోకి నగదు ప్రవాహం తిరిగి వస్తోంది, కంపెనీల లాభాలు బలంగా ఉన్నాయి, వాల్యుయేషన్లు కూడా అదుపులోనే ఉన్నాయి" అని వివరించారు.
అయినప్పటికీ, అంతర్జాతీయ వడ్డీ రేట్లు, విదేశీ పరిణామాల వల్ల మార్కెట్లో ఒడిదుడుకులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి రిటైల్ ఇన్వెస్టర్లు స్వల్పకాలిక లాభాల వెంట పడకుండా, క్రమశిక్షణతో దీర్ఘకాలిక పెట్టుబడులకు కట్టుబడి ఉండటం ఉత్తమం.

ఏడాది కనిష్టానికి బంగారం

సాధారణంగా ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధ మేఘాలు కమ్ముకుంటే, ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు పరుగులు తీస్తారు. కానీ కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో అందుకు పూర్తి విరుద్ధమైన దృశ్యం కనిపించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి ముడి చమురు ధరలు భగ్గుమంటున్న వేళ, బంగారం ధర ఏకంగా ఏడాది కనిష్ట స్థాయికి పడిపోవడం ఇన్వెస్టర్లను ఆశ్చర్యపరిచింది.

గురువారం కామెక్స్ (COMEX) మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 3,857 డాలర్లకు పడిపోయింది. శుక్రవారం ఉదయం స్వల్పంగా కోలుకున్నప్పటికీ, పసిడి మార్కెట్లో బలహీనత స్పష్టంగా కనిపిస్తోంది. సామాన్య కొనుగోలుదారులకు ధరలు తగ్గడం ఊరటనిచ్చే అంశమే అయినా, ఇప్పటికే బంగారంలో పెట్టుబడి పెట్టిన వారికి ఇది మింగుడుపడని పరిణామం.

ట్రంప్ వ్యాఖ్యలు, చమురు మంట
అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలపై ఆశలు సన్నగిల్లడం ఈ ఆకస్మిక మార్పుకు ప్రధాన కారణం. ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం అవసరం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పాటు, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దృష్టిని అంతర్గత నేరాలు, అవినీతిపైకి మళ్లించారు. దీంతో పశ్చిమాసియాలో ఆంక్షలు, సరఫరా ఆటంకాలు కొనసాగుతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 95 డాలర్లు దాటేసింది. చమురు ధరలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తుందనే భయం మొదలైంది.

వడ్డీ రేట్ల భయమే బంగారానికి శాపం
ఇప్పటికే అక్టోబర్ నెలలో అమెరికా వినియోగదారుల ధరల సూచీ అంచనాలకు మించి 0.4 శాతం పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఫెడరల్ రిజర్వ్ అధికారులు బౌమన్, పాల్సన్ కుండబద్దలు కొట్టారు. ఫలితంగా డిసెంబర్ నెలలో ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచడం ఖాయమని మార్కెట్లు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు పెరిగితే బాండ్లపై రాబడి పెరిగి, వడ్డీ లేని బంగారంపై ఆకర్షణ తగ్గుతుంది. బంగారం ఖరీదైనదిగా మారింది.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం

జనరల్ న్యూస్
singidinews@gmail.com

ఆదివారం
15-11-2026

సాలురా సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సహకార వారోత్సవాలు

బోధన్ ప్రతినిధి, నవంబర్14:(సింగిడి):
సాలూరా మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సాకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ అల్లే రమేష్ సహకార జెండాను ఆవిష్కరించారు. సహకార గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా అందిస్తున్న సేవలను రైతులకు వివరించారు. రైతుల అభివృద్ధే సహకార సంఘాల లక్ష్యమని అన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అర్హతను స్వల్ప దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు సేవలు, తక్కువ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు, తదితర సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సంఘ మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గంటే లక్ష్మణ్, ఆలయాల కమిటీ చైర్మన్ లు లోక లక్ష్మణ్, అల్లే శంకర్, సాలురా క్యాంప్ సర్పంచ్ విజయ విజయభాస్కర్ రెడ్డి, సొసైటీ ఇన్చార్జి సీఈఓ కండెల సంజీవ్ కుమార్, డైరెక్టర్లు నాగేశ్వరరావు, గౌస్, వహీద్, మామిడి విజయలక్ష్మి , శివరాజ్, లాలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తులపై అధికారుల నిర్లక్ష్యం!

గద్వాల ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి):



ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం–2005 అమలులో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని జల్లాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త హెచ్. శాంతన్న ఆరోపించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలంలోని పీఏసీఎస్ సింగిల్ విండో కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2021 నుంచి 2026 వరకు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలు కోరుతూ అక్టోబర్ 13న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీఐ దరఖాస్తు పంపినట్లు తెలిపారు. మొత్తం 24 అంశాలతో 13 పేజీల దరఖాస్తు సమర్పించి బిల్లులు, రసీదులు, పనుల వివరాలు, ఫొటోలు, మిగిలిన నిధుల సమాచారం కోరినట్లు పేర్కొన్నారు. అయితే సమాచారం ఇవ్వాల్సిన అధికారులు దరఖాస్తునే తిరిగి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ కార్యాలయానికి ఆర్టీఐ చట్టం వర్తించదని సంబంధిత అధికారి తెలిపినట్లు వెల్లడించారు. విద్యాశాఖ అధికారులను సంప్రదించినా సరైన స్పందన రాలేదని ఆరోపించారు. అక్టోబర్ 13న దరఖాస్తు చేయగా నవంబర్ 13 నాటికి 30 రోజులు పూర్తయినా సమాచారం అందలేదన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మొదటి అప్పీల్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సంబంధిత శాఖల అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని కోరారు. ఆర్టీఐ దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమాచార అధికారుల వివరాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించాలని హెచ్. శాంతన్న కోరారు.

సామాజిక సమస్యలపై పిలుపు

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 14(నినాదం) :
ప్రముఖ కవి, రచయిత ప్రేమ్ లాల్ సామాజిక సమస్యలపై రచించిన కవిత సంపుటిలో నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ ఎల్ నినో ప్రభావం భవిష్యత్తు తరాలు ఈ విషయ మై జాగ్రత్తలను తన కవితల ద్వారా వివరించిన తీరు చాలా బాగుందని కవితలన్నీ సామాజిక సమస్యలను విశ్లేషిస్తున్నాయని ప్రముఖ కవి రచయిత గఫూర్ శిక్షక్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం స్థానిక కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో బి.ప్రేమ్ లాల్ రచించిన కవితా సంపుటి పిలుపు పుస్తకాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకము లో పర్యావరణ పరిరక్షణ జల సంరక్షణ యువతకు సూచించే దిశా నిర్దేశం సమాజంలోని రుగ్మతలను తొలగించే విధంగా అన్ని కవితలు ఆలోచింపజేస్తున్నాయని.పిలుపు సమాజానికి ఒక పిలుపుగా నిలుస్తుంది అని పుస్తకానికి పెట్టిన శీర్షిక సామాజిక ప్రతిబింబంగా నిలుస్తున్నాయని అన్నారు. పుస్తక రచయిత ప్రేమ్ లాల్ మాట్లాడుతూ నీటిని సంరక్షించుకోవాలని ప్రస్తుత ఎల్ఈనో ప్రభావం తీవ్ర రూపం దాల్చకముందే సమాజం మేల్కోవాలని అన్నారు ఇలాంటి విషయాలను ఈ పుస్తకంలో తెలియజేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ అభిమానులు మురళి, మౌనిక, విక్రమ్, రాజేందర్, ప్రవీణ్, సురేష్, నరేష్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో ప్లాట్ విక్రయం



ఆర్మూర్, నవంబర్ 14 (సింగిడి):
బతికున్న భార్య మృతి చెందినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, భార్య పేరు మీద ఉన్న ప్లాటును అక్రమంగా విక్రయించిన ఘనుడును ఆర్మూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గల పెర్కిట్ గ్రామానికి చెందిన దేశాయ్ పేట రవి కి 2017లో గీతాంజలితో వివాహం జరిగింది. వివాహ అనంతరం కుటుంబ కలహాల నేపథ్యంలో గీతాంజలి తన కుమారుడు తో కలిసి తన పుట్టింటికి వెళ్లి జీవితం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో భార్య గీతాంజలి పేరు మీద కోటార్మూ గ్రామంలో ప్లాటు ఉంది, భార్య పేరు మీద ఉన్న 267 గజాల ప్లాట్ ను భర్త దేశాయిపేట రవి ఈ ప్లాటును విక్రయించేందుకు కుట్ర పన్నారు. రవికి ఉన్న డాక్యుమెంట్ అనుభవాన్ని ఉపయోగించి, భార్య మరణించినట్లుగా నక్లి ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేసుకునేందుకు ఇతర సర్టిఫికెట్లను కూడ సమకూర్చుకొని, తనకున్న అనుభవాన్ని కంప్యూటర్ ద్వారా నక్లీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేసుకున్నాడు అని పోలీసులు తెలిపారు. నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా 2025లో భార్య పేరట ఉన్న ప్లాటును, రవి తల్లి లక్ష్మీబాయి పేరుతో గిఫ్ట్ డీడ్ చేయించాడు. అనంతరం అట్టి ప్లాటు స్థలాన్ని ఇతర వ్యక్తికి 15 లక్షలకు విక్రయించడం జరిగింది. అంతేకాకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి పొందేందుకు సైతం నకిలీ పత్రాలను సృష్టించిన వాటిని సైతం పోలీసులు స్వాధీనం చేసుకొని, భార్య బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించి, కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆర్మూర్ పోలీసులు తెలిపారు.

నిత్య భిక్ష ప్రారంభం

బోధన్ ప్రతినిధి, నవంబర్ 14:(సింగిడి):
బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ భీముని గుట్టపై గల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వాములకు నిత్య భిక్ష(అన్న ప్రసాదం) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సంతోష్ శర్మ వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోధన్ ఎసిపి శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ విచ్చేసి భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షులు శివన్నారాయణ, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ మండల దీక్ష కాలాన్ని పురస్కరించుకొని జనవరి మొదటి వారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 గంటల నుండి 3 గంటల వరకు భిక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వ్యక్తిగత పనుల కోసం గంటల దూర ప్రాంతాల నుంచి వచ్చే అయ్యప్ప స్వాములతో పాటు బోధన్ చుట్టూ ప్రక్కల ప్రాంతాల స్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు దీక్ష నిలయం పీఠం స్వాములు భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు.

సింగరేణి సెక్యూరిటీ విభాగ నిర్లక్ష్యానికి మూల్యాలు

మూసి వేసిన ఓ సి లో వృద్ధురాలు మృతి, మరొకి ఆచూకీ లేకపోవడం

వరుస దొంగతనలు సిహెచ్ పి లో ఏసీ, ప్రింట్ మాయం

అనుభవం అవగాహన లేని గాడ్స్ ఏర్పాటే కారణమంటున్న సంఘాలు, సీనియర్లు గార్డ్స్



ఇల్లందు నవంబర్ 14.(సింగిడి):
సింగరేణి సెక్యూరిటీ విభాగం వైఫల్యాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. గడిచిన 45 రోజుల్లో వరుసగా జరుగుతున్న వివిధ రకాల సంఘటనలు ఎందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొయ్యగూడం మొదలుకొని ఇల్లందు మూసివేసిన ఓసి సివిస్పి బీజీ ప్యానెల్ స్టాట్ పిట్ తదితర ప్రాంతాల్లో దొంగతనాలు విపరీతంగా పెరగడం కొన్ని సెక్యూరిటీ విభాగా దృష్టిలోకి రావడం మరికొన్ని రాకపోవడం కొన్ని రికవరీ చేయటం కొందరిని పట్టుకోవడం వంటివి చోటు చేసుకున్నాయి. ఇవేవీ బయటికి పోకుండా అధికారులు మభ్యపెడుతున్నప్పటికీ కొన్ని సంఘటనలు బయటికి రావటంతో వారి పనితీరు పర్యవేక్షణ నిర్లక్ష్యం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృద్ధురాలు మృతి మరొకరు గల్లంతు

పేరుకు ఇల్లందు సింగరేణిలో పర్మినెంట్ ప్రైవేట్ గార్డ్స్ కలిపి 150 మందికి పైగా ఉన్నప్పటికీ మూసివేసిన గనుల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలం చెందారు అనడానికి ఓసి లోపల బేస్ వర్క్ షాప్ వద్ద ఓ వృద్ధురాలు మూడు నాలుగు రోజులపాటు అక్కడే ఉండి మృతి చెందిన సంఘటన వీరి నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది. పట్టణంలోని గోవింద్ సెంటర్ ప్రాంతానికి చెందిన వెంకటమ్మ వృద్ధిరాలు 10 రోజుల క్రితం జెకె ఫై ఓ సి లోపలికి వెళ్లి దారితప్పి అక్కడే సొమ్మసిల్లి పడిపోయి. చూసే దిక్కు లేక పైకి వచ్చే అవకాశం లేక మృతి చెందినట్లు స్వయంగా సింగరేణి అధికారులు గుర్తించటం గమనార్హం. ఈ సంఘటన చోటు చేసుకొని పట్టుమని పది రోజులు గడవకముంది గుర్తుతెలియని వాహనం ఓసి సమీపంలోని నిలిచి ఉండటం సంబంధిత వాహన తీసుకోని వచ్చిన వ్యక్తి ఆచూకీ నేటికీ లభ్యం కాకపోవడంతో సింగరేణి సెక్యూరిటీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. బైకు తో వచ్చిన వ్యక్తి ఓసీలోకి వెళ్లారా లేక మరేటైనా వెళ్ళిపోయారా అనేది అర్థం కాని ప్రశ్న.

కోయగూడెం నుండి ఇల్లందు వరకు

ఇదిలా ఉంటే ఇల్లందు ఏరియా పరిధిలోని కోయగూడెం మొదలుకొని ప్రస్తుతం మూసివేసిన జెకె ఫై ఓ సి 21 ఇంక్లైన్ స్టడ్ ఫీట్ బేస్ వర్క్ షాప్ సిహెచ్ పీ బిజీ ప్యానెల్ తదితర విభాగాల్లో వరుస దొంగతనాలు సింగరేణి సెక్యూరిటీ విభాగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. సెక్యూరిటీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వే బ్రిడ్జిలోని 40 వేల విలువైన ఏసీ ప్రింటర్ ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయయి. సింగరేణి రెండో షిఫ్ట్ లోని ఈ చోరీ గురైనట్లు పక్కా ప్రణాళికతో స్వయంగా చోరుడు నిచ్చెన తీసుకొని వచ్చి ఎత్తుగా ఉన్న గోడ పైకి ఎక్కి ఏసీ ని విప్పుకొని ఎత్తుకు వెళ్లడం చూస్తుంటే సింగరేణి సెక్యూరిటీ గార్డ్స్ ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు ఇట్టే అర్థమవుతుంది. బాధ్యత ఇతంగా పనిచేయాల్సిన పర్మినెంట్ గాడ్స్ కేవలం ఎలాంటి బాధ్యతలేని సాధారణ పోస్టులను ఎంపిక చేసుకొని విధులు నిర్వహిస్తూ స్వయంగా కార్మిక సంఘాల నాయకులు అధికారులు వాపోతున్నారు. దొంగలు ఎక్కువగా తిరగాడే బాధ్యత వహితమైన పోస్టులను ప్రవేట్ సెక్యూరిటీ గార్డ్స్ కి అప్పగించటం అనుభవం లేని కొత్తగా సెక్యూరిటీ విభాగంలోకి వచ్చిన వారిని విలువైన వస్తు సామాగ్రి, దొంగతనాలు జరిగే ప్రాంతంలో వీరిని నియమిస్తున్నట్లు తెలుస్తుంది. తాము సీనియర్లమంటూ ఫలానా సంఘానికి చెందిన డెలిగేట్లమంటూ కేవలం హాస్పటల్, జిఎం ఆఫీస్, గెస్ట్ హౌస్, వీటీసీ, చెక్ పోస్ట్ వంటి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారే తప్ప, సింగరేణి సంస్థకు విలువైన వస్తువులు ఉండే ప్రాంతాల్లో డ్యూటీలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నట్లు స్వయంగా అందులో పనిచేసే గాడ్స్ వాపోతున్నారు. ఇక కొయ్యగూడెంలో జరిగే దొంగతనాలు విషయానికి వస్తే చోరీ విషయం బయటికి రాకుండా ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు కప్పిపుచ్చుకుంటున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. భారీ ఎత్తున చోరీ జరిగినప్పుడు మాత్రమే పై అధికారులకు తెలియజేస్తూ పోలీసులకు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తుంది. కేవలం తాము సెక్యూరిటీ గార్డలమని చెప్పుకోవడానికి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు తప్ప బాధ్యత వహితంగా పనిచేస్తున్న సందర్భాలు తక్కువ అని ఎవరికి వారి వారికి సంబంధించిన యూనియన్ నాయకులతో ఫైరవీలు చేయించుకుంటున్నారే తప్ప విధుల పట్ల అంకితభావంతో పనిచేసే గార్డులు తక్కువగా ఉన్నారు అంటూ అందులో పనిచేసే గార్డులుస్వయంగా చర్చించుకోవడం గమనార్హం. ఏది ఏమైనా సంస్థ ఆస్తులు కాపాడటానికి నియమించబడిన సెక్యూరిటీ గార్డుల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడంతోపాటు యూనియన్ నాయకుల ఒత్తిళ్లకు తలోగ్గి వారికి నచ్చిన పోస్టులు వేయటమే ఈ దొంగతనాలు మరణాలకు కారణాలని తెలుస్తుంది భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా విధుల పట్ల అంకితభావంతో పనిచేసే విధంగా సెక్యూరిటీ గార్డులకు సూచనలు సలహాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్థిక భరోసా కలిపించే పథకమే జీవిత బీమా

ఇల్లందు, నవంబర్ 14 (సింగిడి) :



కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐ కే జీ బి పీ) ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు.అయన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ, నవంబర్ 19 న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానున్న నేపథ్యంలో మన నియోజకవర్గ పరిధిలో కూడా ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ పథకం ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి లేదా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవన భద్రతకు అండగా నిలవడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ పథకానికి సంబంధించిన ప్రత్యేక శిబిరాలు నవంబర్ 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక శిబిర కేంద్రాన్ని, పట్టణ ప్రాంతాల్లో ప్రతి వార్డుకు ఒక శిబిర కేంద్రాన్ని గుర్తించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ భవనాలు, సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో అనువైన శిబిర కేంద్రాలను గుర్తించి, వాటి వివరాలను నవంబర్ 14వ తేదీ ఉదయం లోగా సీపీఓ కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు.
పథకం ప్రారంభానికి ముందుగా సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, అమలు విధానంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించి, అర్హులైన కుటుంబాలకు పథకం వివరాలు చేరేలా చర్యలు తీసుకోవాలని, నవంబర్ 19వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులకు విన్నవించారు . సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

పిల్లలే దేశ భవిష్యత్తు.. విద్యతోనే సమాజాభివృద్ధి

కొత్తగూడెం (చుంచుపల్లి), నవంబర్ 14 (సింగిడి):



పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బి. వీరన్న అన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్గుతండలో పేద, అనాథ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బి. వీరన్న మాట్లాడుతూ.. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించేందుకు మాత్రమే ఉపయోగపడే సాధనం కాదని, మంచి వ్యక్తిత్వాన్ని, ఆలోచనా విధానాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదన్నారు. విద్యావంతులైన పౌరులతోనే అవినీతి రహిత, సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.దేశ అభివృద్ధికి విద్యే బలమైన పునాది అని, నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, దేశ నిర్మాణకర్తలుగా ఎదగనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ది స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ అసోసియేషన్ సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎన్. రాకేష్, తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ బి. వీర ప్రతాప్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీను, తదితరులు పాల్గొన్న

విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

చుంచుపల్లి, నవంబర్ 14(సింగిడి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు నవతన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు పెట్టడం ద్వారా ఆయనకు గౌరవం ఇవ్వడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన మహోన్నత సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసినట్లవుతుందని అన్నారు.గతంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో కొత్తగూడెం జిల్లాకు బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించామని నవతన్ గుర్తుచేశారు. ప్రజా ఉద్యమాల ఫలితంగా జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం అనే పేరు వచ్చిందని తెలిపారు.అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కొత్త విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలని గతంలో ఉద్యమాలు చేసినప్పుడు స్పందించిన ప్రభుత్వం, ఇప్పుడు విమానాశ్రయానికి కూడా ఆయన పేరు పెట్టడంలో ఎందుకు వెనుకడుగు వేయాలని ప్రశ్నించారు.జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలని పోరాడాం.. ఇప్పుడు విమానాశ్రయానికీ అంబేద్కర్ పేరు పెట్టాలని కోరుతున్నాం. ఇది ఎవరికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదు. కోట్లాది మంది అణగారిన వర్గాలకు ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం అని నవతన్ పేర్కొన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు కాదని, దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేందుకు జీవితాంతం పోరాడిన మహానేత అని అన్నారు. ఆయన పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి దేశానికి ఒక గొప్ప సందేశం వెళ్తుందని పేర్కొన్నారు. విమానాశ్రయానికి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టే విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నవతన్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దశలవారీగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. మొదట వినతిపత్రాలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం, నిరసనలు, ధర్నాలు చేపట్టి, అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.కొత్త విమానాశ్రయానికి "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విమానాశ్రయం"గా నామకరణం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా తాను ప్రభుత్వాన్ని అధికారికంగా డిమాండ్ చేస్తున్నానని ఆయన తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రేపు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా

ఖమ్మం ప్రతినిధి నవంబర్ 14:(సింగిడి)
జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని, ఎన్నికలలో ఇచ్చిన జర్నలిస్టుల స్థలాల హామీని అమలు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్) జిల్లా కమిటీ సమావేశం ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులు అనేక సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వాలు ఎన్ని మారిన కూడా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయని ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఈనెల 16న సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, మందుల ఉపేందర్, ప్రశాంత్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు మూల జీపన్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు ఉత్కంఠం శ్రీను, కళ్యాణ

డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి



కొత్తగూడెం, నవంబర్14(సింగిడి) :
డంపింగ్ యార్డు నుండి వెలువడుతున్న విషవాయువులతో స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితుడు కోట రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ (పాత కొత్తగూడెం) జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్ద శనివారం స్థానికులు చెత్త వాహనాలను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం టౌన్ పరిధిలోని 29 డివిజన్ల చెత్తను నిత్యం భారీ మొత్తంలో ఇక్కడికి తరలిస్తున్నారని, కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో చెత్త తడిసినప్పుడు, నిప్పుపెట్టినప్పుడు తీవ్రమైన విషవాయువులు వెలువడుతున్నాయని తెలిపారు. ఈ కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, విషజ్వరాల బారిన పడి స్థానికులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా తమ కుటుంబ సభ్యులంతా ఈ విషవాయువులు పీల్చి తీవ్ర అనారోగ్యం పాలయ్యారని వాపోయారు. గతంలో పలుమార్లు చెత్త వాహనాలను అడ్డుకుంటే పోలీసులతో అందోళనను విరమింపజేసి, రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తాత్కాలిక హామీలు కాకుండా డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ బాధ్యులు వచ్చి ఎప్పటిలాగే సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం చూపే వరకు వెనక్కి తగ్గేది లేదని స్థానికులు తెగేసి చెప్పడంతో చెత్త వాహనాలను వెనక్కి తీసుకెళ్లి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోనే చెత్తతో పాటు నిలిపివేయడం గమనార్హం. సమస్యను పరిష్కరించకుండా వాహనాలను ఆఫీసు ఆవరణలో ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నారాయణపేట, నవంబర్ 14, (సింగిడి):
నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాదిగిర్ రోడ్డు మార్గంలో కమాండర్, ఆటో వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చలికాలంలో పొగమంచు, తక్కువ వెలుతురు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనాల్లో లైట్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, పోగా మంచులో అత్యవసరం అయితే తప్ప జర్నీ ఎక్కువ చేయరాదు అని సూచించారు. వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని అన్నారు., పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులను తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ఆర్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర ధృవపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కరణం అవ్వొచ్చు మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.జిల్లా కేంద్రంలోని యాదిగిర్ రోడ్డు మార్గంలో వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్‌కు, ప్రజలకు అంతరాయం కలిగించరాదని, వాహనాలను నిర్ణీత క్రమంలో నిలిపి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడపాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య హెచ్చరించారు.

నివాసాల మధ్య నిత్యం పేలుళ్లు..

జిన్నారం నవంబర్ 14 సింగిడి:



జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని సర్వే నంబర్ వన్ లో జరుగుతున్న భారీ బ్లాస్టింగ్లు, స్థానిక నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం పేలుళ్లు జరుపుతుండడంతో రోడ్లపైనా ,ఇళ్లపైకి కంకర రాళ్లు పడుతుండడంతో గ్రామా సమీపంలోని కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళన గురవుతున్నారు. బ్లాస్టింగ్ల దాటికి ఇల్లు పగ్గుళ్ళు వస్తున్నాయని, ఏ క్షణాన, ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రాణభయంతో బతుకుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు జరుపుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అక్రమ బ్లాస్టింగ్లను తక్షణమే నిలిపివేసి తమకు రక్షణ కల్పించాలని శివాలయం కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

విమానాశ్రయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

కొత్తగూడెం, నవంబర్ 14(సింగిడి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల ఏళ్ల నాటి కల ఎట్టకేలకు సాకారమవుతూ, సుజాతనగర్ మండల పరిధిలో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర విమానయాన శాఖ పచ్చజెండా ఊపింది. సాధ్యం కాదనుకున్న ఎయిర్‌పోర్టు కలను తన అలుపెరగని కృషితో సుసాధ్యం చేసి చూపించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘన సాధనపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పెనగడప, పాల్వంచ–దుమ్ముగూడెం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, సీతంపేట, సుజాతనగర్ సహా ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, వాతావరణ, వరద పరిస్థితులపై సర్వే నిర్వహించిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం సుజాతనగర్ వద్ద 667 ఎకరాల స్థలాన్ని తుది ఎంపిక చేసింది. విమానాశ్రయ ఏర్పాటుకు ఇది పూర్తి అనుకూలంగా ఉందని ఫీజిబులిటీ నివేదికను కేంద్రానికి సమర్పించడంతో ఏఏఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం అందింది. గరీబ్‌పేట, సుజాతనగర్ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కూనంనేని అసెంబ్లీ వేదికగా, ఢిల్లీ స్థాయిలో మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ప్రత్యేక చొరవ చూపారు. ప్రజాప్రతినిధిగా తన దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధిస్తూ అధ్యయన కమిటీ పర్యటనకు, సానుకూల నివేదిక రావడానికి ఆయన చేసిన కృషి చరిత్రాత్మక విజయంగా నిలిచింది. సుజాతనగర్ వద్ద ఎంపికైన ఈ ప్రాంతం ప్రధాన రహదారికి 3.4 కిలోమీటర్లు, కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు 5.7 కిలోమీటర్లు, భద్రాచలానికి 35.4 కిలోమీటర్ల దూరంలో ఉండటం ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా మారనుంది. ఎయిర్‌పోర్టు రాకతో జిల్లాలో పారిశ్రామిక, పర్యాటక, ఉపాధి రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందనున్నాయి. కేంద్రం నుంచి సానుకూల సంకేతాలు రావడంతో ఇక భూసేకరణ, ఇతర మలిదశ పనులపై కసరత్తు ప్రారంభం కానుంది. అసాధ్యమనుకున్న ప్రాజెక్టును పట్టుదలతో సాధించి జిల్లా అభివృద్ధికి కొత్త బాటలు వేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పలువురు నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందిస్తున్నారు.

ఎన్‌హెచ్ఎం కమిషనర్‌తో ఫలించిన చర్చలు

33 రోజుల రిలే నిరాహార దీక్షలకు తాత్కాలిక ముగింపు

నారాయణపేట, నవంబర్ 14, (సింగిడి):
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 33 రోజులుగా నిరంతరంగా చేపట్టిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు ఎట్టకేలకు తాత్కాలికంగా ముగిశాయి. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి కమిషనర్‌తో నిర్వహించిన చర్చలు ఫలప్రదం కావడంతో ఉద్యోగులు సమ్మెను తాత్కాలికంగా విరమించి తిరిగి విధుల్లో చేరాలని నిర్ణయించుకున్నారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, మూడు నెలల పాటు ఉద్యోగుల సమస్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఎన్‌హెచ్ఎం కమిషనర్ నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ నిర్ణయంతో ఉద్యోగుల్లో కొంతమేర ఆశాభావం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షులు కాశపోగు ప్రసాద్ మాట్లాడుతూ కమిషనర్‌తో జరిగిన చర్చల్లో ఉద్యోగుల సమస్యలపై సానుకూల నిర్ణయం రావడంతో 33 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు తాత్కాలికంగా ముగింపు పలుకుతున్నట్లు తెలిపారు. కమిషనర్ ఇచ్చిన హామీ మేరకు ఐదుగురు సభ్యుల కమిటీ మూడు నెలల పాటు సమగ్రంగా అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరూ తిరిగి విధుల్లో చేరుతున్నట్లు వెల్లడించారు.ఇందులో భాగంగా శనివారం రెండో శనివారం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) అందుబాటులో లేకపోవడంతో జిల్లా ప్రోగ్రామ్ అధికారి (డీపీఓ) భిక్షపతికి ఉద్యోగులు తమ జాయినింగ్ లెటర్లను అందజేశారు. తాజాగా కమిషనర్‌తో జరిగిన చర్చలు ఫలించడంతో ఉద్యోగులు విధుల్లోకి తిరిగి చేరేందుకు సిద్ధమయ్యారు. గత 33 రోజులుగా తాము వివిధ రూపాల్లో చేసిన నిరసనలకు మద్దతు తెలిపితమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళే విధంగా సహకరించిన



పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా ప్రింట్ అండ్ మీడియా మిత్రులకు యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం యూనియన్ నాయకులు రాఘవేందర్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నర్సింగ్‌రావు, డాక్టర్ మోనేష్ చారి, డాక్టర్ తిరుపతి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శ్వేతాశ్రీ, డాక్టర్ వినోద్, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ విజయ్, డాక్టర్ భవాని, ఏఎన్ఎంలు సావిత్రమ్మ, సుజాత, పుష్ప, అంబుబాయి, దీవిక, సుజాతరాణి, రాజేశ్వరి, సుమిత్ర, జీఎన్ఎంలు , తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు ఎనలేనివి

డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 14 (సింగిడి):
మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జవహర్ లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షులు, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించారని, అనంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దూరదృష్టితో ఎన్నో సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, జాతీయ సమైక్యత వంటి విలువలకు నెహ్రూ



అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆశయ ఆశయాలు నేటికి దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. మహోనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో ముందుండాలని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా మాజీ ఎంపీ విఠల్ రావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, డిసిసి ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, సాయిబాబా, ఎంఏ. కలీం, నాయకులు అజ్మత్‌అలీ, అవేజ్, ఫక్రు, గులాం జహీర్, తాహేర్, నర్సింహా రెడ్డి, అక్బర్, గంగిరెడ్డి, అబ్రార్ హుస్సేన్, చందు యాదవ్, తిరుపతినాయక్, రాంచంద్రయ్య, అలీం, హకీమ్, మజర్ ఖాన్, నసీరుద్దీన్, నర్సింహ, జగదీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్లు మంజూరు

ఆర్మూర్, నవంబర్ 14(సింగిడి):
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్‌పల్లి మండల కేంద్రమైన కమ్మర్‌పల్లి గ్రామానికి నూతన పెన్షన్లు 73 మంది లబ్ధిదారులకు మంజూర య్యాయని మాజీ మండల కాంగ్రెస్ పార్టీ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షులు సుంకేట్ రవి, తోపాటు కాంగ్రెస్ నాయకులు శనివారం రోజున విలేకరుల సమావేశంలో తెలిపారు. కమ్మర్‌పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్మర్‌పల్లి గ్రామానికి 73 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్లు మంజూరు చేశారని, అట్టి నూతన పెన్షన్లను బాల్కొండ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి నూతన పెన్షన్ల మంజూరు చేశారని వారు తెలిపారు. పెన్షన్ల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల ఏ.ఎం.సి.వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, సల్లూరి గణేష్ గౌడ్, నూకల బుచ్చిమల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సింగిరెడ్డి శేఖర్, పాష, సుంకేట శ్రీనివాస్, కొడ శైలేందర్, పీర్ల అరవిందు, కౌడ అరవింద్, సంపంగి నాగరాజు, దూలూరు కిషన్, చంద్రకాంత్ రెడ్డి, ఉట్నూరు నరేందర్, బోదాసు అశోక్, పలువురు,పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన సన్మానం



గద్వాల ప్రతినిధి నవంబర్ 14 (సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ఆగిపోకు చరిత విద్యారంగంలో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోంది. చంద్రన్న రెండవ కుమారుడు చెన్నకేశన్న, కళ్యాణ జ్యోతి దంపతుల కుమార్తె అయిన చరిత 9, 10వ తరగతులను కేరళలో, ఇంటర్మీడియట్ విద్యను నెల్లూరులో పూర్తి చేసింది. ప్రస్తుతం డిగ్రీ చదువుతో పాటు దేశ రాజధాని ఢిల్లీలో యూపీఎస్సీ (UPSC) పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతోంది. ఇటిక్యాల గ్రామం నుంచి ఢిల్లీలో ఉంటూ ఉన్నత విద్యతో పాటు యూపీఎస్సీ కోచింగ్ పొందుతున్న తొలి విద్యార్థినిగా గుర్తిస్తూ రాజ్యాంగ పరిరక్షణ సమితి జిల్లా కమిటీ నాయకులు చరితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు అభ్యసించి ఐఏఎస్ అధికారిణిగా, కలెక్టర్‌గా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశీస్సులతో ఆమె లక్ష్యాన్ని సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆకేపోగు మైరాముడు, కో–కన్వీనర్లు ఆకేపోగు అలెగ్జాండర్, ఉదండాపురం హనుమంతు, పూదూరు ఆశన్నతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ ఇంటిగ్రిటీపై ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు



నారాయణపేట, నవంబర్ 14, (సింగిడి):
హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ వేదికగా నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి ప్రజాస్వామ్యం, ఎలక్టోరల్ ఇంటిగ్రిటీ (ఎన్నికల సమగ్రత) అంశాలపై తన గళాన్ని వినిపించారు. సమ్మిట్‌లో పాల్గొన్న సీనియర్ ప్యానెలిస్టుల మధ్య తాను అత్యంత చిన్న వయస్కురాలినని చెబుతూ, తెలంగాణ రాష్ట్రంలో అతి చిన్న వయస్సుల్లో ఒకరైన ఎమ్మెల్యేగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల ఓటు హక్కు, దాని పవిత్రత అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఓటు, ప్రతి పౌరసత్వం ప్రశ్నార్థకం కావడం ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని హెచ్చరించారు. తెలంగాణ జనాభా సుమారు 3.87 కోట్లుగా ఉంటే, అందులో దాదాపు 73 లక్షల ఓట్లను అనుమానా స్పదంగా పరిగణించి తొలగించారని ఆమె తెలిపారు. ఇది చాలా భయానక పరిణామమని అభివర్ణించారు.ప్రత్యేకించి తన నారాయణపేట నియోజకవర్గంలో దాదాపు 2 లక్షల మంది ఓటర్లు ఉండగా, సుమారు 40 వేల ఓట్లను తొలగించారని, మరో 50 వేల నుండి 60 వేల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పర్ణికా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉన్న ఒక నియోజకవర్గంలో ఇన్ని వేల ఓట్లు తొలగించబడితే ప్రజా ప్రతినిధులుగా తాము ఏ స్థానంలో ఉండాలని ఆమె ప్రశ్నించారు. యువత దేశాన్ని నడిపించే ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 14 (సింగిడి) :
నగరంలోని సుభాష్ నగర్ లోని నారాయణ హై స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులకు బోధిస్తూ ఉపాధ్యాయుల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఏజిఎం శివాజీ, ప్రిన్సిపాల్ రోమా రాయ్ , ఏవో అఖిల్ లు పాల్గొని ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులను అభినందించారు.విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.ఈ వేడుకలు పాఠశాలలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనంగా స్వాగతం



గద్వాల బ్యూరో నవంబర్ 14(సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ పర్యటించారు. ఉదయం ఎర్రవల్లి మండలం పదో బెటాలియన్ అతిథి గృహం వద్ద న్యాయమూర్తికి జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి, ఇతర అధికారులు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అతిథి గృహం వద్ద కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం న్యాయమూర్తి గద్వాల మండలం, పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న జిల్లా కోర్టు సముదాయాల నూతన భవన నిర్మాణాల స్థలమును పరిశీలించారు. హైకోర్టు న్యాయమూర్తికి భవన నిర్మాణం పనుల గురించి అధికారులు వివరించారు. ఈ పర్యటనలో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ నిష్మా పాత్రుడు, ఆర్డీవో శ్రీనివాసరావు డిఎస్పి మొగిలయ్య, బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ ఆదినారాయణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రిగుట్టపై పారిశుద్ధ్య కార్యక్రమాలు

ఆర్మూర్, నవంబర్ 14-(సింగిడి):
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో గల అతి పురాతనమైన, ప్రసిద్ధిగాంచిన లింబాద్రిగుట్ట పై జాతర సందర్భంగా ఈనెల 12 నుంచి బ్రహ్మోత్సవాలు వేద పండితులు ఆలయ ఆచార్యులు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. జాతర సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జాతర, రథోత్సవం జిల్లాలోని అతి పెద్ద జాతరగా పేర్కొంటారు. శనివారం రోజునఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల వియతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్,పాలకవర్గం సభ్యుల ఆదేశాల మేరకు లింబాద్రిగుట్టపై ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల పనులు చేపట్టి పరిశుభ్రత భక్తుల సౌకర్యార్థం కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ తెలిపారు. ఈ సందర్భంగా గుట్టపై డివైడర్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, రహదారులన్నింటినీ శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించడం, రోడ్లపై స్వీపింగ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

బాలలు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలి

విద్యార్థులు జిజ్ఞాస, క్రమశిక్షణ, మంచి అలవాట్లను అలవర్చుకోవాలి.: కలెక్టర్ ప్రియాంక





నారాయణపేట ప్రతినిధి, (సింగిడి): బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచిం చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్. ఆర్. గార్డెన్స్ లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమా నికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రప టానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించు కొని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులం దరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితం లో పెద్ద పెద్ద కలలు కనాలని, భవిష్యత్తులో తాము ఏ స్థాయికి చేరుకోవా లనుకుంటున్నారో ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశిం చుకోవాలని సూచించారు. రాకెట్ సైంటిస్టులు, జిల్లా కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, గొప్ప పారిశ్రామి ఒకవేత్తలు కావాలనే ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు అన్నిసబ్జె క్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయా ల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసు కోవాలనే జిజ్ఞాసను పెంపొం దించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయా లను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకో వాలని అన్నారు. అదేవిధంగా కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులలోని భిన్నత్వాన్ని గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, తోటి విద్యార్థులను వేధిం చడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలి కారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో అనవసరమైన రీల్స్, సోషల్ మీడియా, గేమ్స్‌కు ఎక్కువ సమయం కేటాయిం చకుండా, విజ్ఞా నాన్ని పెంపొందించే సైన్స్, గణితం, విద్యా సంబం ధిత వీడియో లను వీక్షించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవ ర్చుకోవా లని, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియో గం చేసుకోవా లన్నారు. పుస్తక పఠనం వల్ల ఆలోచనా పరిధి, సృజ నాత్మకత, జ్ఞానం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులం దరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్క రించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యా ర్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమం లో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజు లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏ ఎం వో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ వో కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ వన్యప్రాణులను
వేటాడితే కఠిన చర్యలు...

జాతీయ పక్షి నెమలీలను చంపిన అయిదుగురు పై కేసు నమోదు చేసిన బాల్కొండ పోలీసులు...



ఆర్మూర్, (సింగిడి):అటవీ వన్యప్రాణులను వేటాడిన, వేటా డి చంపిన, వన్యప్రాణులను విక్రయించిన కఠిన చర్యలు తప్పవని బాల్కొండ ఎస్సై,యాసిర్ అరాపత్ వెల్లడించారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ లో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై, యాసిర్ అరాపత్ మాట్లాడుతూ బాల్కొండ శివారు ప్రాంతంలో బాల్కొండ ఎస్సై, పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా, ఇండియన్ పెట్రోల్ బంక్ వెనకాల గుర్తుతెలియని వ్యక్తులు జాతీయ పక్షులను వేటాడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు, బాల్కొండ ఎస్సై తో పాటు,పోలీసులు అనుమానస్ప దంగా తిరుగుతున్న వ్యక్తులను పట్టుకొని వారిని విచారించగా మొదటి వ్యక్తి సంగీల నరసింహ, రెండో వ్యక్తి మేరి కల్ అంకంరావు, మూడవ వ్యక్తి మేకల రామయ్య, నాలుగవ వ్యక్తి మెలిక కళ్యాణ్, ఐదవ వ్యక్తి మెరిక అంకంరావు లను పట్టుకొని పరిశీలించగా ఒక తెల్లని సంచి లో రెండు జాతీయ పక్షులైన నెమలీలు చనిపోయి ఉన్నాయని, వేటకు సంబంధించిన ఒక వల, ఒక టార్చ్ లైట్, ఒక బ్యాటరీ ఉన్నాయని, దీన్నిబట్టి వేరు అడవి జంతువులను, వ న్య ప్రాణులను, పశువులను వేటాడే గ్యాంగ్ అని ఎస్సై. తెలిపారు. జాతీయ పక్షులను వేటాడి చంపిన అయిదుగురు వ్యక్తులపై, వైల్డ్ లైఫ్ అనిమల్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు నిందితులను హాజరు పరిచినట్లు బాల్కొండ ఎస్సై, యాసిర్ అరాఫత్ తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా వన్య ప్రాణులను వేటాడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, వన్య ప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.

పడకల్‌కి నూతన పింఛన్ మంజూరు చేసిన
ఎమ్మెల్యే, ఎంపీకి కృతజ్ఞతలు

సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి.



కల్వకుర్తి (సింగిడి): తలకొం డపల్లి మండల పరిధి లోని పడకల్ గ్రామానికి అత్యధిక సంఖ్యలో నూతన పింఛన్లు మంజూరు కావడంతో గ్రామ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించే దిశగా నూతన పింఛన్లు మంజూరు చేయడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి సహకారంతో పడకల్ గ్రామానికి పెద్ద సంఖ్యలో నూతన పింఛన్లు మంజూరయ్యాయని గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,గ్రామ ప్రజల సంక్షే మాన్ని దృష్టిలో ఉంచుకొని అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయించేందుకు సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవికి పడకల్ గ్రామ ప్రజల తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ పేదలకు అండగా నిలుస్తున్న నాయకుల సహకారం అభినందనీయ మని పేర్కొన్నారు.నూతన పింఛన్ల మంజూరుతో అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు వారి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎమ్మెల్యే, ఎంపీ మరింత సహకారం అందించాలని ఆకాంక్షించారు. పడకల్ గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రజాప్రతినిధు లకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజల తరఫున మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను
సందర్శించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం, (సింగిడి):: ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పనితీరు, పెండింగ్ కేసులకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రౌడీషీటర్ల కదలికలపై సెక్టర్ ఆఫీసర్లు నిరంతరం నిఘా ఉంచాలని, వారి ప్రస్తుత కార్యకలాపాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ప్రవర్తన తీరును సమీక్షించాలి. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిదంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విజబుల్ పోలిసింగ్ పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

పోలీస్ స్టేషనే వేదికగా.. అరుదైన వేడుక

పోలీస్ స్టేషన్‌లో మానవతా దృక్పథం.. మహిళాకానిస్టేబుల్‌కు అట్టహాసంగా సీమంతం



నారాయణపేట ప్రతినిధి, (సింగిడి): రక్షక భటులుగా శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ శాఖ, మరోసారి తనలోని మాన వీయ కోణాన్ని చాటు కుంది. విధి నిర్వహణే కాదు.. తోటి ఉద్యోగుల బాగోగులు, వారి కుటుంబ వేడుకల్లో పాలుపం చుకోవడంలోనూ తాము ముందుంటా మని నారాయణపేట జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు, తోటి సిబ్బంది నిరూపించారు. నారాయ ణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచే స్తున్న మహిళా కానిస్టేబుల్ శిరీష ఏడు నెలల గర్భ వతి కావడంతో, తోటి సిబ్బంది ఆమెకు ఘనంగా సీమంతం వేడుక నిర్వహించారు.సాధారణంగా సీమంతం వేడుకలను ఇళ్లలో లేదా ఫంక్షన్ హాల్స్‌లో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. కానీ, నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇందుకు భిన్నంగా కనీవినీ ఎరుగని రీతిలో ఈ వేడుకను నిర్వహించారు. టౌన్ సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మహిళా ఎస్ఐ గాయత్రి తదితరులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పోలీస్ అధికారులతో పాటు సహచర కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు అందరూ కలిసి నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను వేదికగా చేసుకుని శిరీషకు పూలు, పండ్లు, చీర, గాజు లతో సంప్రదాయబద్ధంగా సీమంతం జరిపించారు. నిండు నూరేళ్లు ఆయుష్షుతో ఉండి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదించిన ఆ అధికారులు, తోటి కానిస్టేబుళ్లు. స్టేషన్లో జరిగిన ఈ ఆత్మీయ వేడుకతో పోలీస్ సిబ్బంది అంతా ఒకే కుటుంబంలా మారిపోయారు.



అభినందించిన ఉన్నతాధికారులు

ఇది తెలుసుకున్న స్థానికులు

ఖాకీ యూనిఫాం వెనుక కూడా సున్నితమైన మనసు లుంటాయని, తోటి సిబ్బంది కష్టసుఖాల్లో పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ వేడుక మరోసారి రుజువు చేసింది. ఎక్కడాలేని విధంగా పోలీస్ స్టేషన్ లోనే మహిళా కానిస్టే బుల్‌కు సీమంతం నిర్వహించిన సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రిలను తోటి సిబ్బందిని పలువురు అభినందిస్తు న్నారు. ఈ అరు దైన ఘటన నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం చర్చ నీయాంశంగా మారడంతో పాటు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇలాంటి వినూత్న మైన కార్యక్రమా లను చేస్తూ ప్రజల మన్ననలు, ప్రేమాభి మానాలను చూరగొని సొంతం చేసుకుంటున్నా నారాయణపేట పోలీసులు.

రేషన్ షాపు పేరుతో నగదు వసూళ్ల ఆరోపణలు!

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్‌పై యువకుడి ఫిర్యాదు..

గద్వాల ప్రతినిధి (సింగిడి): జోగులాంబ గద్వాల జిల్లాలో రేషన్ డీలర్ షాపు కేటాయింపు వ్యవ హారం వివాదానికి దారితీసింది. మనవపాడు మండలం లో రేషన్ షాపు ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి డబ్బులు తీసుకున్నారని ఆలంపూర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్‌పై ఓ యువకుడు ఆరోపిస్తు న్నాడు. ఈ వ్యవహారా నికి సంబంధిం చిన ఫోన్ సంభా షణల ఆడియో సోషల్ మీడి యాలో వైరల్ కావడంతో స్థానికంగా చర్చ మొదలైంది.

షాపు ఇప్పించలేదని ఆరోపణ

బాధిత యువకుడి కథనం ప్రకారం.. రేషన్ డీలర్ షాపు ఇప్పిస్తానని నమ్మించి పచ్చర్ల కుమార్ డబ్బులు తీసుకున్నారని ఆరోపిస్తున్నాడు. డబ్బులు ఇచ్చిన తర్వాత షాపు కేటాయింపునకు సంబం ధించిన ఉత్తర్వుల కాపీ కూడా తనకు అందజేశారని చెబుతున్నాడు. అయితే కొంతకాలానికి ఆ ఉత్తర్వులు రద్దు చేసి మరో వ్యక్తికి షాపు కేటాయించారని వాపోతున్నాడు.

డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్

షాపు తనకు కేటాయించకపోవడంతో గతంలో ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని బాధితుడు కోరుతున్నాడు. అయితే నేటికీ, రేపటికి అంటూ డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయా పన చేస్తున్నారని ఆరోపిస్తున్నాడు. ఈ క్రమం లో ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

పోలీసులకు ఫిర్యాదు చేస్తా..

తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వ కపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధితుడు హెచ్చరిం చినట్లు సమాచా రం. ఈ వ్యవహారంపై సంబం ధిత అధికారులు విచారణ జరిపి వాస్తవా లను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందన కోసం ఎదురుచూపులు

గతంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. ఏ. సంపత్ కుమార్ వద్ద పీఏగా పనిచేసిన పచ్చర్ల కుమార్ ప్రస్తుతం ఆలం పూర్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా కొనసా గుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమ య్యాయి. అసలు డబ్బుల లావాదేవీలు జరిగాయా? రేషన్ షాపు కేటాయింపు ఉత్త ర్వులు ఎందుకు రద్దయ్యాయి? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఆరోపణలపై పచ్చర్ల కుమార్ వివ రణ, సంబంధిత అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది.

చిమ్మపూడి గ్రామంలో ఏటీఎంఏ ఆధ్వర్యంలో
రైతు క్షేత్ర పాఠశాల నిర్వహణ.



ఖమ్మం, (సింగిడి): ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏటీఎంఏ 2026-27 పథకంలో భాగంగా ఎస్సీ ఉప ప్రణాళిక కింద రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా మిరప పంటతో పాటు యాసంగి సీజన్‌కు సంబంధించి పెసర, మినుము, నూనెగింజలు మరియు ఇతర అపరాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎస్సీ రైతులకు వ్యవసాయ ఇన్‌పుట్స్ పంపిణీ చేయడం జరిగింది.రైతులకు యాసంగి పంటల్లో శాస్త్రీయ సాగు పద్ధతులు, అనుకూలమైన విత్తన రకాల ఎంపిక, విత్తన శుద్ధి, విత్తే విధానం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, సమగ్ర సస్యరక్షణ చర్యలు మరియు చీడపీడల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, ఎల్‌నినో ప్రభావం వల్ల యాసంగి 2026--27 సీజన్‌లో ఎదురయ్యే వాతావరణ మార్పులు, వర్షపాతం లోటు మరియు నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పెసర, మినుము, నూనెగింజలు మరియు ఇతర అపరాల పంటలను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకో వాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, కోయచలక వ్యవసాయ విస్తరణ అధికారి కార్తీక్, చిమ్మపూడి గ్రామ సర్పంచ్. నర్సి రెడ్డి,వార్డు వార్డ్ మెంబర్స్ గుండ్ల ముత్తయ్య, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో
ముందుండాలి..

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్

ఖమ్మం, (సింగిడి): చదువుతోపాటు విద్యార్థులు అని రంగాల్లో ముందు ఉండేదని కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు. శు క్రవారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన బాలోత్సవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు డాక్టర్ యుగంధర్ అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడలు, సాంస్కృ తిక కార్యక్రమాల్లో రాణించాలని కోరారు,దీనివల్ల విద్యార్థులకు మానసిక ఆనందాన్ని కలిగిస్తా యని తెలిపారు,వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించిన చింతనిప్పు కృష్ణ చైతన్యని డాన్సర్స్ అసోసియే షన్ ని అభినందించారు.

కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ,ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా..!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

నవంబర్ 14 నుంచి గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం.. అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు

నాగర్‌కర్నూల్ (సింగిడి): : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి అర్హ కుటుం బానికి రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించేలా జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. పథకం ప్రయోజనాలపై అర్హులైన ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని, ఒక్క కుటుంబం కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా పారదర్శకంగా, కచ్చితత్వంతో వివరాలను నమోదు చేయాలని సూచిం చారు. నవంబర్ 14వ తేదీ నుంచి గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు నమోదు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథ కం అమలు, ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబా ద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్రసచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దేవసహాయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతోందని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించిన ప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికా కుండా రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కులం, మతం, వర్గం, లింగం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకం అమలుకు రూ. 4 వేల కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని ప్రారంభించను న్నట్లు తెలి పారు. అంతకంటే ముందుగానే నవంబర్ 14 నుంచి గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. కుటుంబాల వివరాల నమోదు అత్యంత కీలకమని పేర్కొంటూ సామాజిక, ఆర్థిక సర్వే వివరాలు, రేషన్ కార్డుల సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అర్హులను గుర్తించాలని సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుం బాల విషయంలోనూ ప్రభుత్వ మార్గద ర్శకాల ప్రకారం పరిశీలన జరిపి అర్హులకు పథకం ప్రయోజనం అందేలా చూడాలన్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో నమోదు కేంద్రాల వివరాలు, నమోదు తేదీలు, సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

రాజకీయ మార్పు కోసమే నా పోటీ

తెలంగాణ రక్షణ సేన పట్టభద్రుల అభ్యర్థి ఆకాష్ కొల్లురు



నారాయణపేట ప్రతినిధి, (సింగిడి): రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి, పేదలు యువత గొంతుకగా నిలవడానికి తాను ఈ ఎన్ని కల్లో పోటీ చేస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన పార్టీ పట్టభద్రుల అభ్యర్థి ఆకాష్ కొల్లురు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శాసనపల్లి రోడ్డులో గల ఓ హోల్లో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లా డుతూ, సుదీర్ఘకాలంగా జర్నలిజంలో పనిచేసిన అనుభవంతో పాటు, ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. జాతీయ మీడియా ఛానెళ్లలో 12 సంవత్సరాలు పనిచేసి, 15 నేషనల్ ఇన్వెస్టిగేషన్స్ చేసినట్లు ఆయన తెలిపారు. రాజకీయాల్లోకి ఎందుకు? జర్నలిస్టుగా ఎన్నో కథనాలు చేసినప్పటికీ, చట్టాలు మారకపోవడం, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోవడాన్ని గమనించిన తర్వాతే రాజకీయాలే సరైన మార్గమని నమ్మి బరిలోకి దిగినట్లు ఆకాష్ కొల్లూరు వెల్లడించారు. పేద కుటుంబాల విద్యార్థులకు ఏడు సంవత్సరాల వరకు ఉచిత విద్యను అందించేలా విధానాలు అమలు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో యువత సాధికారత కోసం కృషి చేస్తూ, బ్యాంకుల ప్రమేయం లేకుండా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందించేలా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. జర్నలిస్టు లకు వారి అనుభవాన్ని బట్టి కనీస వేతనం ఉండేలా ప్రత్యేక చట్టాలు తెస్తామని, ప్రైవేట్ మీడియా హౌస్‌లలోనూ ఇది వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. మైనారిటీ విద్యార్థుల ఉపాధి అవకాశాల కల్పనకు పార్టీ తరఫున ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తామన్నారు.ప్రస్తుత రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే హామీలు ఇస్తున్నారని, వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని ఆయన విమర్శించారు. చదువుకున్న పట్టభద్రులు, యువత ఇకనైనా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చు కోవాలని, మార్పు కోసం తనను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఈ పర్యటనలో భాగంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు పలువురు న్యాయవాదులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బార్ కౌన్సిల్ తరఫున వచ్చిన అభ్యర్థన మేరకు న్యాయవాదులందరికీ ఆరోగ్య భీమా సదుపాయం కల్పించే అంశంపై ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇట్టి

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు.

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి.



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి): జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను జిల్లా ఉప వైద్యాధి కారి, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల లోని అల్ట్రాసౌండ్ యంత్రాలు, వైద్యుల అర్హత ధ్రువీకరణ పత్రాలు, అనుమతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాతో పాటు జైలు శిక్ష, వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెల 5వ తేదీలోపు ఫారం–ఎఫ్ వివరాలను ఆరోగ్యకేంద్రాలలో సమర్పించాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులు ఒకే విధంగా ఉండాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లలో పేషెంట్లకు కనిపించేలా హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డెమో రాజేశం, జూనియర్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణే ధ్యేయంగా పనులు చేపట్టాలి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్.



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):: జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు అభివృద్ధి పనులను అమృత్ 2.0 పథకం కింద 3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ సమీంద్ల వాణి తో కలిసి చింతకుంట చెరువు, గ్రేవీ యార్డ్, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిరక్షణ, అభివృద్ధి పనుల ప్రణాళిక, పరిసర ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. చెరువుల సహజ స్వరూపాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, భావితరాలకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య , కమిషనర్ సత్యప్రణవ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ

జిజ్ఞాస ప్రాజెక్టుల్లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతులు,

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జిజ్ఞాస విద్యార్థి పరిశోధన ప్రాజెక్టుల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించారు. 2025--26 విద్యాసంవత్సరానికి రసాయనశాస్త్రం, తెలుగు విభాగాల్లో రూపొందించిన ప్రాజెక్టులకు ఈ పురస్కారాలు దక్కాయి. విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

మరోవైపు, కళాశాల ఆరోగ్య క్లబ్, మెడికవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ గౌరీలక్ష్మి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత, రుతుక్రమ సమస్యలు, రక్తహీనత, థైరాయిడ్ తదితర సమస్యలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మరో కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ సుస్మిత మధుమేహం లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. సమతుల ఆహారం, వ్యాయామం, క్రమబద్ధమైన జీవనశైలితో మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చని సూచించారు. కార్యక్రమాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అఫ్రీ ఉస్మాని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

10+2 విద్యావిధానంపై బడ్జెట్ పాఠశాలలకు స్పష్టత ఇవ్వాలి

ఉపాధ్యాయులు, తరగతి గదులు, ప్రయోగశాలల ఏర్పాటుకు ఆచరణ సాధ్యమైన మార్గదర్శకాలు జారీ చేయాలి

టీఆర్ఎస్ఎంఏ గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): నూతన 10+2 విద్యావిధానాన్ని స్వాగతిస్తున్నామని, అయితే బడ్జెట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని టీఆర్ఎస్ఎంఏ గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రత్యేక ఉపాధ్యాయులు, తరగతి గదుల ఏర్పాటు పాఠశాలలకు ఆర్థిక భారంగా మారుతుందని తెలిపారు. అర్హులైన పీజీ ఉపాధ్యాయుల కొరత, అదనపు గదులు, ప్రయోగశాలల ఏర్పాటు, అద్దె భవనాల్లో స్థలాభావం వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. 11, 12వ తరగతులు ప్రారంభించని పాఠశాలలు పదో తరగతి వరకు కొనసాగించాలా, ఎనిమిదో తరగతికే పరిమితం కావాలా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తగిన గడువు, ఆచరణ సాధ్యమైన మార్గదర్శకాలు, సహకారం అందించి విద్యార్థులకు నష్టం కలగకుండా, పాఠశాలలు మూతపడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాళోజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

రేకుర్తిలో ఘనంగా ప్రజాకవి వర్ధంతి నివాళులర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): తెలుగు సాహిత్యానికి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. రేకుర్తిలోని కాళోజీ నగర్‌లో నిర్వహించిన కాళోజీ వర్ధంతి వేడుకల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, సమాజంలోని అసమానతలపై తన రచనలతో గళమెత్తిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన స్ఫూర్తి మరువలేనిదని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి కృష్ణాగౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అరోమా స్వీట్స్ అండ్ బేకరీ ప్రారంభం



ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరైన ఎమ్మెల్యేలు గంగుల, పాడి కౌశిక్ రెడ్డి

కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): నగరంలోని కోర్టు ఎదురుగా పెంచాల కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అరోమా స్వీట్స్ అండ్ బేకరీని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందిస్తూ ప్రజ లకు నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి బేకరీ వంటశాలను ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, శ్రీవిద్య సందడి చేశారు. ప్రారంభోచ్చావానికి ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ, ఆధునిక స్వీట్లు, కేకులు, అల్పాహార పదార్థాలను పరిశుభ్రతతో, సరసమైన ధరలకు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కుల రవీందర్, అరుణ్ కుమార్, సంతోష్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల సర్వయ్య, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం అభివృద్ధి పనులపై గంగుల దృష్టి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం, సదర్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ,ఆశా కార్యకర్తలకు మద్దతు,



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చామనపల్లి, చర్లబుత్కూర్ గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్నతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించి, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22న సర్దార్ స్టేడియంలో నిర్వహించ నున్న సదర్ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవా లకు హాజరుకావాలని యాదవ సంఘం ప్రతినిధులు ఆయనను ఆహ్వానించారు. అలాగే, రూ. 18 వేల స్థిర వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు వినతిపత్రం, సమ్మె నోటీసు అందజే శారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిం చాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు. మరోవైపు, చర్లబుత్కూర్ నుంచి ప్రశాంత్‌నగర్ మీదుగా దుబ్బపల్లి వరకు రూ. 3.50 కోట్లతో నిర్మించిన రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు గంగులకు స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా ఆయన కొత్త రహదారిపై గ్రామస్తులతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణించారు. రహదారి నిర్మాణంతో రాకపోకల ఇబ్బందులు తొలగాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే పంటల సాగుపై దృష్టి సారించాలి

నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలు సాగు చేయాలి

వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల డైరెక్టర్ వెంకట్ రెడ్డి



జమ్మికుంట, (సింగిడి): ఎల్ నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకొని, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) జగిత్యాల డైరెక్టర్ డాక్టర్ ఏ. వెంకట్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్, వర్మీ వాష్, పశుగ్రాస పంటలు, నర్సరీ యూనిట్లను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి, పత్తి, కంది, కూరగాయల క్షేత్రాలను సందర్శించి, పంటల సాగు విధానాలు, ఆధునిక సాంకేతిక పద్ధతుల అమలుపై ఆరా తీశారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, నేల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే సగుణ పునరుత్పాదక సాంకేతిక విధానం (ఎస్ఆర్‌టీ) అమలవుతున్న పరిశీలనా క్షేత్రాన్ని కూడా సందర్శించారు. కేవీకే ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు లక్ష్యాలు, పురోగతి, రైతులకు అందిస్తున్న సాంకేతిక సహకారంపై వివరాలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, ఎస్ఆర్‌టీ విధానాలను అనుసరిస్తున్న ఆదర్శ రైతులతో మాట్లాడి వారి అనుభవాలు, ఫలితాలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా ఆవాలు, పెసర, మినుములు, వేరుశనగ, శనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్ రావు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంట దీపావళి సంబరాలు

ధర్మరాజుపల్లిలో లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకున్న ప్రణవ్



జమ్మికుంట, (సింగిడి): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని హుజురా బాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామంలో ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఆయన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లా డుతూ.. గతంలో ఇళ్లు లేని నిరుపేదలు పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లలో పండుగలు జరుపుకునే వారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వారి సొంతింటిలో దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే 2,500 ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ధర్మరాజుపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి గుడిసెలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చా రు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. దీపాల వెలుగుల మాదిరిగా ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఏవో కిషన్‌కు ఏఐటీయూసీ నాయకుల వినతి.



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి): జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవో కిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి వేతనాలు నిలిచిపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ప్రతి నెల 5వ తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఇన్‌చార్జి వెన్న మహేష్, మాడిశెట్టి కిరణ్ కుమార్, మామిడి రాజం పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా

ధాన్యం కొనుగోళ్లు

చామనపల్లి, చర్లబుత్కూర్‌లో కేంద్రాలు

ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల, ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): చామనపల్లి, చర్లబుత్కూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న ప్రారంభించారు. ధాన్యం విక్రయ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్, దుర్వెడ్ సహకార సంఘాల అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, తోట తిరుపతి, గ్రామ సర్పంచులు బోగొండ ఐలయ్య, కూర నరేష్ రెడ్డి, సీనమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

దుబ్బ మల్లన్న కళ్యాణ, జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రణవ్



జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు హుజూరా బాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వచ్చే నెల నుండి జరిగే మల్లికార్జున స్వామి కళ్యాణం, జాతరకు సంబంధించి పోస్టర్ ను ప్రణవ్ ఆవిష్కరించారు. ఎంతో మహిమ కలిగిన ఈ ఆలయంలో జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయాలని కమిటీని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో దుబ్బ మల్లన్న చైర్మెన్ రవీందర్, కౌన్సిలర్లు, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతోనే విద్యార్థుల సర్వతోముఖ వికాసం

ఆల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఘనంగా 'విక్టరీ ల్యాప్' విజేతలకు బహుమతుల ప్రదానం

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి): విద్యార్థుల జీవితంలో చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో కీలకమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన 'విక్టరీ ల్యాప్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించడంతోపాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భారత క్రీడా దిగ్గజాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకోవడమే నిజమైన విజయమని అన్నారు. ప్రారంభంలో క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థుల ప్రదర్శించిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు వేడుకలకు మరింత ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అలుగునూర్‌లో దీక్షా దివస్ సభకు ఏర్పాట్లు

29న కేటీఆర్ హాజరు

సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన గంగుల కమలాకర్



కరీంనగర్ ప్రతినిధి, (సింగిడి):

ఈనెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అలుగునూర్‌లో నిర్వహిం చనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మర మయ్యాయి. ఈ మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలిం చారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో వేదిక ఏర్పాటు, వాహనాల పార్కింగ్, రాకపోకల క్రమబద్ధీకరణ, మౌలిక సదుపా యాలపై చర్చించారు. కార్యక్ర మానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ పరిశీలనలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సామాజికసేవలోనూ ముందుండాలి

వైద్యులు ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి, (సింగిడి): విద్యార్థులు చదువుతో పాటు సామాజికసేవలోనూ ముందుండాలని ప్రముఖ వైద్యుడు, సామాజిక సేవకుడు ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్‌లో వారం రోజులపాటు నిర్వహించే ప్రత్యేక శీతాకాల శిబిరం శుక్రవారం ప్రారంభ మయ్యింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి వలంటీర్లను ఉద్దేశించి మాట్లా డారు. వారంరోజులపాటు శిబిరంలో ఉండడం వల్ల వాలంటీర్లకు సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వలక్షణాలు అలవడతాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామం లో వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నల్ల కవిత స్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొట్టాల తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ ఎడమల సత్తిరెడ్డి, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పి.భూమేష్, అధ్యాపకులు రిజ్వాన, సునీత, జగన్, రాగలహరి, రజిత, అంబేద్కర్, చైల్డ్ మారేజ్ ప్రొటెక్షన్ సిబ్బంది మౌనిక, లత, నీరజ తదితరులు తపాల్గొన్నారు.

విద్యార్థులే అధ్యాపకులై..

తరగతుల నిర్వహణ

కాకతీయ పాఠశాలలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు

జమ్మికుంట, (సింగిడి): జమ్మికుంట పట్టణం లోని కాకతీయ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే అధ్యాపకులుగా మారి తరగతులు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 38 మంది విద్యార్థులు అధ్యాపకుల పాత్రలు పోషిస్తూ వివిధ తరగతులకు బోధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ రావు మాట్లాడుతూ.. నవంబర్ 14న జరుపుకునే బాలల దినోత్స వాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ముందస్తుగా ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యా ర్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణ, పట్టు దల, అంకితభావంతో ముందుకు సాగాలని సూచిం చారు. విద్యార్థి దశజీవితంలో అత్యంత విలువైనదని, ఈ సమయా న్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

బాక్సర్లు అంబేకర్,గుంజాన్‌లకు

బంగారు పతకాలు



సెనెగల్‌లో జరుగుతున్న యూత్ ఒలింపిక్స్-2026లో భారత్ పసిడి నిరీక్షణకు తెరపడింది. గురువారం ఒకే రోజు రెండు బంగారు పతకాలు దక్కాయి. ఆ స్వర్ణాలు బాక్సింగ్‌లోనే రావడం విశేషం. పురుషుల విభాగంలో అంబేకర్, మహిళల విభాగంలో గుంజాన్ గోల్డ్ మెడల్స్ సాధించారు. ముందుగా పురుషుల 50 కేజీల కేటగిరీలో విజేతగా నిలిచాడు. ఫైనల్‌లో అంబేకర్ ఐర్లాండ్‌కు చెందిన బా?సర్ జుబాని క్రిస్టియన్‌పై 3-2 తేడాతో విజయం సాధించాడు. దీంతో యూత్ ఒలింపిక్స్ చరిత్రలో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారత బాక్సర్‌గా నిలిచాడు. ప్రస్తుత ఎడిషన్‌లో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్ అందించాడు కూడా అతనే. అంబేకర్ చరిత్రాత్మక పతకం గెలిచిన కాసేపటికే మహిళా బాక్సర్ గుంజాన్ కూడా 48 కేజీల కేటగిరీలో పసిడి పతకం కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ఆమె అల్జీరియాకు చెందిన బౌతైనా బెన్సలాపై 5-0 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. మూడు రౌండ్ల పోటీలో గుంజాన్ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించింది. ఐదుగురు జడ్జీలు 30-27తో ఆమెకు అనుకూలంగా స్కోరు ఇచ్చారు. దీంతో యూత్ ఒలింపిక్స్ చరిత్రలో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారత మహిళా బాక్సర్‌గా గుంజాన్ నిలిచింది. గురువారం దక్కిన రెండు స్వర్ణ పతకాలతో ఈ టోర్నీలో భారత్ పతకాల సంఖ్య 10కి చేరింది. అందులో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి.

క్రీడాకారులు.. 'అర్జున' అందుకున్నారు

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న ధనుష్ శ్రీకాంత్







దిల్లీ: క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. 2025 సంవత్సరానికి గాను అర్జున, ద్రోణాచార్య ఎంపికైనవారు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలను అందుకున్నారు. తెలంగాణ కుర్రాడు, బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ కూడా వీరిలో ఉన్నాడు. టోక్యో డెఫ్లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్‌లో ప్రపంచ రికార్డు స్కోరుతో ధనుష్ పసిడి గెలిచాడు. మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో స్థిరంగా రాణిస్తున్న పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జంటకు కూడా అర్జున దక్కినా.. వాళ్లు అందుబాటులో లేకపోవడంతో అవార్డును స్వీకరించలేదు. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో గాయత్రి ద్వయం కాంస్యంతో మెరిసింది. లాల్రెమ్‌సియామి (హాకీ), దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతి (చెస్), తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్) తదితరులు అర్జున అవార్డు అందుకున్నారు. నేహా చవాన్ (షూటింగ్), చోటె లాల్ యాదవ్ (బాక్సింగ్), పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్) ద్రోణాచార్య పురస్కారాన్ని పొందారు. ఈ ఏడాది ఆగస్టు 18న అర్జున, ద్రోణాచార్య అవార్డు పొందిన ప్లేయర్ల జాబితాను క్రీడల శాఖ ప్రకటించింది. 17 మందికి అర్జున.. ముగ్గురికి ద్రోణాచార్య పురస్కారాలు దక్కాయి. ఫుట్‌బాల్‌లో అందించిన సేవలకు ఇసాయా అరుమైనాయగామ్‌కు అర్జున జీవిత కాల సాఫల్య అవార్డు దక్కింది. బెంగళూరుకు చెందిన 84 ఏళ్ల ఇసాయా వీల్ ఛైర్‌లో వచ్చి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత ఫుట్‌బాల్ జట్టులో ఇసాయా సభ్యుడు.

ప్రపంచ రికార్డు సృష్టించినోడు

కెప్టెన్‌గా వైభవ్‌కు తప్పని తొలి ఓటమి

అత్యంత పిన్న వయసులోనే సారథ్యం చేపట్టిన క్రికెటర్‌గా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించినా.. ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. తాను కెప్టెన్సీ చేపట్టిన మొదటి మ్యాచ్‌లోనే తన జట్టు ఓటమిపాలైంది. ఇక బ్యాటర్‌గానూ పెద్దగా ప్రభావం చూపించలేదు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బిహార్ జట్టుకు తొలి రెండు మ్యాచుల్లో వైభవ్ సూర్యవంశీ కెప్టెన్‌గా ఆ రాష్ట్ర బోర్డు నియమించింది. సౌరాష్ట్రతో తొలి మ్యాచ్‌లో ఈ యువ ప్లేయర్ 12 బంతుల్లో 18 పరుగులు మాత్రమే చేశాడు. ఇక తన జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు మాత్రమే చేయగలిగింది.



అనంతరం లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర 16.3 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 138 పరుగులు చేసి విజయం సాధించింది.



ఇదీ వైభవ్ రికార్డు..

ప్రపంచ క్రికెట్‌లో ఓ జట్టుకు తక్కువ వయసులోనే సారథ్యం చేపట్టిన తొలి క్రికెటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. అతడు 15 ఏళ్ల 7 నెలల వయసులో బిహార్‌కు కెప్టెన్ అయ్యాడు. అంతకుముందు ఈ రికార్డు క్రొయేషియా ఆటగాడు జెక్ పురుసిక్ పేరిట ఉండేది. గతేడాది అతడు 17 ఏళ్ల 311 రోజుల వయసులో క్రొయేషియాకు సారథి అయ్యాడు. ఇక డొమిస్టిక్ టీ20 పోటీల్లోనూ పాక్ ఆటగాడు తైమూర్ అలీ (17 ఏళ్ల 358 రోజులు) పేరిట ఉన్న ఘనతనూ వైభవ్ అధిగమించాడు. వీరిద్దరికి దాదాపు రెండేళ్ల వ్యత్యాసం ఉండటం గమనార్హం



Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737